జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




# 'టాటా పవర్' వచ్చేస్తోంది..

- టాటా రెన్యువబుల్ ఎనర్జీతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం
- ఈ ఒప్పందం ద్వారా పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.49వేల కోట్ల పెట్టుబడులు
- రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో వచ్చే అయిదేళ్లలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ ఒప్పందం

అమరావతి, మహానాడు: భారతదేశ పునరుత్పాదక ఇంధన రంగంలో పేరెన్నికగన్న టాటా పవర్ అనుబంధ సంస్థ టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధికి సహకారం, కొత్త అవకాశాలను అన్వేషణకు ఏపీ ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో టాటా రెన్యువబుల్ ఎనర్జీ, ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు. ఇది రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకమైన అడుగు. ఈ ఒప్పందం ప్రకారం టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 7 గిగావాట్ల (7వేల మెగావాట్లు) పునరుత్పాదక ఇంధన అభివృద్ధి అవకాశాలను అన్వేషిస్తాయి.

సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ఒప్పందం ద్వారా సుమారు 49వేల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు వస్తాయి. దీంతో రాష్ట్రంలో అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడుల్లో టాటా రెన్యువబుల్ ఎనర్జీ అగ్రస్థానంలో నిలవనుంది. ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలకు దోహదపడటమే కాకుండా ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందిస్తుంది. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తూ వారి జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా టాటా రెన్యువబుల్ కు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను చేరుకునేందుకు ట్రాన్స్‌ఫర్మేషన్‌ను మిగతా.. 2లో

# మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- ప్రభుత్వం నుంచి మహిళలకు మరింత ప్రోత్సాహకాలు
- సంపాదనలో మగవారికంటే మహిళలే మెరుగ్గా రాణిస్తున్నారు... ఏఐలోనూ రాణించాలి
- మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, ఇందుకు ఎన్డీయే ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. న్యూ జెనరేషన్ – టెక్కేడ్ ఫర్ సస్టైనబుల్ ఎంటర్‌ప్రైజెస్ – ప్రోస్పెరిటీ ఫర్ ఆల్" అనే అంశంపై విజయవాడలోని నోవోటెల్ హోటల్ జరిగిన అంతర్జాతీయ సదస్సులో మహిళా పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి మాట్లాడారు.

మహిళల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచడం, సాంకేతికత వినియోగం, నూతన ఆవిష్కరణల ద్వారా ఆర్థికంగా వృద్ధి సాధిస్తారని వివరించారు.

## మగవారికంటే మహిళలే మెరుగ్గా రానిస్తున్నారు

ప్రస్తుతం మహిళలు సంపాదనలో పురుషుల కంటే మెరుగ్గా రాణిస్తున్నారని అన్నారు. అన్ని రంగాల్లో అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. శ్రామిక శక్తిలో మహిళలు లేకుండా పురోగతి అసాధ్యమని వివరించారు. ప్రపంచ దేశాల్లో కెల్లా భారతదేశంలో మహిళల శ్రామిక శక్తి భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని అన్నారు.

నా చిన్నతనంలో నా తల్లి వంటగదిలో పడ్డ ఇబ్బందులు నేను చూశాను. నా తల్లి పడిన కష్టం ఏ మహిళా పడకూడదనే ఉచిత గ్యాస్ కనెక్షన్లు తీసుకొచ్చాను. నా తల్లి కష్టం ఈ పథకాన్ని తీసుకురావడానికి ప్రేరణగా నిలిచింది. ప్రస్తుతం దీపం 2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇచ్చి మహిళలపై భారాన్ని మరింత తగ్గిస్తున్నాం.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను దాదాపు 45 శాతం మహిళలే నడిపిస్తున్నారు. బ్యాంకు లింకేజ్ ద్వారా రుణాలు అందించి స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడంతో మహిళలకు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తారని, అందుకోసం అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. దీనికోసం ప్రభుత్వం ప్రముఖ బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటుందని వివరించారు.

## ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా మద్దతు

రాష్ట్రంలో వ్యాపారం ప్రారంభించాలనుకున్న ఏ మహిళకైనా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా నిర్మాణాత్మకమైన మద్దతును అందిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలను అన్ని రకాలుగా ముందుకు నడిపించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ విషయం తాను ఇప్పుడు మాట్లాడటం కాదు... రాబోయే రోజుల్లో ఫలితాలను కూడా చూపిస్తానని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని మహిళలను ప్రోత్సహించి అద్భుతాలను సృష్టిస్తామని అన్నారు.

## ఏఐలోనూ మహిళలు రాణించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి మహిళ కూడా ఏఐలో రాణించాలి. భవిష్యత్ అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సదే. మీరు ఆఫీసులో పని చేసి ఇంటికి వెళ్లేముందుగా ప్రోగ్రామ్ చేసుకుని ఇంటికి చేరుకునే సమయానికి ఆహారాన్ని సిద్ధంగా ఉంచుకోవచ్చు. నూతన ఆవిష్కరణలే మన జీవితాలను మార్చుతాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రకారం 2.4 ట్రిలియన్ డ్రాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ ఆవిష్కరించాలన్న ఉద్దేశంతో విజన్‌ను రూపొందించాం. ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా ప్రపంచంలోనే నెంబర్ గా నిలిపి 15 శాతం వృద్ధి రేటు సాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## డిజిటల్ అక్షరాస్యత అవసరం

నిరంతర అభ్యాసం ప్రతి ఒక్కరికీ అవసరం. అభ్యాసం అనేది జీవితాంతం కొనసాగే ప్రక్రియ, తద్వారా అపారమైన జ్ఞానాన్ని పొందగలం. ప్రపంచం వేగంగా మారుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకోవాలి. డిజిటల్ టెక్నాలజీ ప్రయోజనాలను పొందాలంటే డిజిటల్ అక్షరాస్యత తప్పకుండా అవసరం. పౌరులు టెక్నాలజీతో పాటు సెల్‌ఫోన్‌లను కూడా విరివిగా వినియోగించాలి. ప్రస్తుత కాలంలో భార్య లేకుండా భర్త, భర్త లేకుండా భార్య జీవించగలుగుతున్నారు కానీ సెల్‌ఫోన్ లేకుండా ఏ ఒక్కరూ ఉండలేకపోతున్నారు.

మహిళలు పని, గృహ బాధ్యతలను సమర్ధవంతంగా సమతుల్యం చేసుకోవడానికి వీలుగా రాష్ట్రంలో వర్క్ ఫ్రం హోం విధానాన్ని తీసుకురాబోతున్నాం. మహిళలు నూతన ఆవిష్కరణలను తీసుకురావాలి. మహిళా సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది. మహిళా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి.

అవకాశాలను అంచనా వేసుకుని, రాష్ట్ర పురోగతికి సమిష్టిగా పనిచేయాలి. రాష్ట్ర అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దాం. కార్యాచరణ, ఆవిష్కరణల ద్వారా ఏపీని ఎంట్రప్రెన్యూర్‌లకు కేంద్రంగా మార్చేందుకు కృషి చేసి రాష్ట్రాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించేందుకు అందరం పనిచేద్దాం' అని పిలుపునిచ్చారు.




# ఏపి కేబినెట్ నిర్ణయాలు

మంగళగిరి,మహానాడు

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

- డీపీవోల కేడర్ క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతిపాదనలకు ఆమోదం.
- డీపీవోలు నేరుగా రిపోర్టు చేసేలా కేడర్లో మార్పులపై కేబినెట్ నిర్ణయం.
- పౌరసేవలు నేరుగా ప్రజలకు అందేలా చూసేలా కేడర్లో మార్పులకు ఆమోదం.
- ప్రైవేటు వర్సిటీల చట్టసవరణ బిల్లుపై ఉన్నత విద్యాశాఖ ప్రతిపాదనలకు ఆమోదం.
- కుప్పం నియోజకవర్గంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం.



- వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం.
- 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనకు ఆమోదం.
- సీతంపేటలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఉచిత భూమి కేటాయింపునకు ఆమోదం.
- రాజమహేంద్రవరంలో వ్యవసాయ కళాశాల ఉచిత భూమీ కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం.
- రాజమహేంద్రవరం పాత రైల్వే హ్యావలాక్ బ్రిడ్జి అభివృద్ధికి 116 ఎకరాల కేటాయింపునకు ఆమోదం.
- మద్యం దుకాణాల్లో సోండి కులాలకు 4 షాపులు కేటాయింపునకు ఆమోదం.
- 2024–29 టూరిజం ల్యాండ్ అలాట్మెంట్ పాలసీ ప్రతిపాదనలకు ఆమోదం.

# మా పైసలు.. మాగ్గావాలె!

- ఆర్థికమంత్రి భట్టిని నిలదీసిన ఉద్యోగ సంఘాలు
- పెండింగ్‌లో 8 వేల కోట్ల ఉద్యోగుల బిల్లులు
- 20శాతం కమిషను తీసుకుంటున్నారని ఆరోపణ
- ఖజానా వట్టిపోయిన రేవంత్ సర్కార్
- ఏప్రిల్ నుంచి నెలకు 500 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను క్లియర్‌చేస్తా
- ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క
- సచివాలయంలో కాంట్రాక్టర్ల ధర్నా..
- భట్టి విక్రమార్కకు వ్యతిరేకంగా నినాదాలు
- రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- 25న అసెంబ్లీని ముట్టడిస్తాం
- తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్
- కాంట్రాక్టర్లందరి బిల్లులు 500 కోట్లు -
- బిల్లులు చెల్లించుకుంటే ఆత్మహత్యలే శరణ్యం
- రోడ్డెక్కిన సివిల్ కాంట్రాక్టర్లు

హైదరాబాద్: సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత లేదని.. ఎన్ని వందలు, వేల కోట్ల రూపాయలయినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామంటూ వేదికలు, ప్రెస్‌మీట్లలో ప్రగల్భాలు పలికే తెలంగాణ సర్కారు వద్ద.. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులకూ దిక్కులేదని స్పష్టమైన వైనమిది.




అత్యవసర బిల్లులు, మెడికల్ బిల్లులకూ దిక్కులేని దయనీయంపై ఉద్యోగ సంఘాలు, సాక్షాత్తూ ఆర్థిక మంత్రి భట్టి సమక్షంలోనే విరుచుకుపడిన తీరు.. సర్కారు వద్ద 8 వేల కోట్లు కూడా లేవన్న నిజాన్ని బట్టబయలు చేసింది. మా పైసలు మాగ్గావాలె.. మా పైసలు మాకియ్యమంటే 20 శాతం కమిషన్లు అడుగుదున్నారు. మేం కమిషన్లు ఇయ్యం. వెంటనే మా పెండింగ్ బిల్లులు చెల్లించండి అంటూ హెచ్చరికలు జారీ చేసిన వైనం రాష్ట్ర మిగతా.. 2లో

**ఉద్యోగులు బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదు** 2లో



04

ఏఐ, ఆధునిక సాంకేతిక అనుసంధానంతో పాలనలో వేగవంతం



08

నా పోటీ గుజరాత్‌తో కాదు.. న్యూయార్క్, టోక్యోతోనే పోటీ



02

జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు నామినేషన్

## మంత్రి లోకేష్ చొరవ..

# 'పెదవడ్లపూడి' పూర్తి!

- త్వరలోనే మంత్రి ప్రారంభం
- ట్రయల్ రన్ వేసి మోటార్లు, పంపుల పనితీరును పరిశీలించిన అధికారులు
- వైసీపీ హయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఎత్తిపోతల పథకం
- అయిదేళ్ళలో 30 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయిన వైసీపీ
- అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించిన మంత్రి నారా లోకేష్
- నారా లోకేష్ కృషి పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు, రైతులు

మంగళగిరి, మహానాడు: కూటమి ప్రభుత్వ పాలనలో మంగళగిరి నియోజకవర్గ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి పనులు పూర్తవుతున్నాయి. వైసీపీ పాలనలో నిధుల లేమితో నిలిచిపోయిన పెదవడ్లపూడి హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకం మంత్రి నారా లోకేష్ చొరవతో పూర్తయింది. దీంతో



మంగళగిరి మండలం, పెదవడ్లపూడి గ్రామంలో ఉన్న హైలెవెల్ కెనాల్ ఎత్తిపోతల పథకం త్వరలోనే మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా పారంభం కానుంది. శుక్రవారం ఎత్తిపోతల పథకం వద్ద ట్రయల్ రన్ వేసి మోటార్లు, పంపుల పనితీరును అధికారులు పరిశీలించారు. పైపుల ద్వారా సాగునీటిని దిగువకు విడుదల చేసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

గత టీడీపీ ప్రభుత్వ హయంలో 9 కోట్ల రూపాయలతో 70 శాతం పనులను పూర్తిచేయగా వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయకపోవడంతో మిగతా.. 2లో



## వైద్య, ఆరోగ్య శాఖకు

# రూ.19,264 కోట్లు

- రూ.250 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు
- అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి, మహానాడు: గిరిజన ప్రాంతాల్లో ఒక్కొక్కటీ రూ. 50 కోట్ల వ్యయంతో అయిదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్ని నిర్మిస్తున్నామని వైద్య, రోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం శాసన సభకు వివరించారు. రూ. 19,264 కోట్లు బడ్జెట్ గ్రాంట్ ను మంజూరు చేసినందుకు మిగతా.. 2లో




# ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..

- మంత్రి సంధ్యారాణి కీలక ప్రకటన

మంగళగిరి,మహానాడు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కీలక ప్రకటన చేశారు. ఏ జిల్లా మహిళలకు ఆ జిల్లా పరిధిలో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నట్టు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కచ్చితంగా ఉంటుందని, అయితే, ఒక జిల్లా వారు మరో జిల్లాలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ విషయంపై స్పష్టత నిస్తున్నట్టు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై నిన్న శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సంధ్యారాణి ఇలా బదులిచ్చారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించేలా

# బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

- వరంగల్ లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ ...
- నిర్ణయించిన బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్
- తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కంకణ బద్ధులమై మరింతగా పోరాడుదాం...
- బిఆర్ ఎస్ తెలంగాణ సమాజ రాజకీయ అస్తిత్వ పార్టీ ..
- తెలంగాణ ప్రజల గుండెల్లో నెలువైన తెలంగాణ పార్టీ ..
- తెలంగాణ కు రక్షణ కవచం బిఆర్ఎస్
- రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే
- తెలంగాణ సమాజం గర్వించేలా వేడుకలు
- బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్ఘాటన

హైదరాబాద్, మహానాడు:

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటినుండీ కాపాడుకుంటూ వస్తున్న బిఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రక్షణ కవచం అని, ఈ విషయం గత పద్నాలుగు నెల్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా



మరోసారి స్పష్టమైందని,, అందుకు తెలంగాణ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి అనిశ్చితే నిదర్శనమని బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు.

బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 27 ఏప్రిల్ తేదీకి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో నిర్వహించే రజతోత్సవ వేడుకల్లో భాగంగా.. వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈమేరకు వరంగల్ సమీపంలో విశాలమైన అనువైన ప్రదేశాలను పరిశీలించి త్వరలో సభా వేదిక స్థలాన్ని నిర్ణయించనున్నట్టు కేసీఆర్ మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ॥ శనివారం 08, మార్చి 2025 ॥

# జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు నామినేషన్



**అమరావతి, మహానాడు:** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికకు కూటమి తరపున జనసేన అభ్యర్థిగా నాగబాబు శుక్రవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, బీజేపీ శాసనపక్ష నేత పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తో కలిసి రిటర్నింగ్ అధికారి వనితా రాణి కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ దాఖలు సందర్భంగా కూటమి ఎమ్మెల్యేలు నాగబాబుని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యోగులు బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదు

- పదివేల కోట్ల పెండింగ్ బిల్స్ క్లియర్ చేశాం
- ఏప్రిల్ నుంచి ఉద్యోగుల బకాయిలు లేకుండా చూస్తాం.
- ఇప్పటివరకు ఉన్న పాత బకాయిలను ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తాం
- ఉద్యోగుల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,మహానాడు:**
ప్రభుత్వ ఉద్యోగులు వారి బకాయిల కోసం తిరగాల్సిన పనిలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను అర్థం చేసుకొని ఒక నిర్ణయం తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఐదు వేల కోట్ల బిల్స్ పెండింగ్లో పెట్టి వెళ్లిందని, గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని వివరించారు. పాత, కొత్త పెండింగ్ బిల్స్ 10,000 కోట్లు తమ ప్రభుత్వం క్లియర్ చేసిందని తెలిపారు. మరో ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయి అని వివరించారు. ఏప్రిల్ మాసం నుంచి ఎలాంటి బకాయిలు లేకుండా చూస్తామని, అట్లాగే దానితోపాటు ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న 8,000 కోట్ల పాత బకాయిలు రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రతినెల 500 నుంచి 600 కోట్ల వరకు ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్స్ క్లియర్ చేస్తామన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారి సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని, రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని తెలిపారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ తదితర బిల్లును మాత్రమే పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరలో క్లియర్ చేస్తామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలు పరిష్కరించడానికి వివిధ క్యాబినెట్ సభ్యులు ఉన్నాయని ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, వివిధ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు, మున్సిపల్, వైద్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'టాటా పవర్' వచ్చేస్తోంది..

**మొదటి పేజీ తరువాయి..**

వేగవంతం చేయాలన్న సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో ఇదొక ఒక మైలురాయిగా నిలుస్తుంది. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో 10లక్షల కోట్ల పెట్టబడులు, 160 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యంతో రెన్యువబుల్ ప్రాజెక్టులు ఏర్పాటు



కావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆంధ్రప్రదేశ్లో రెన్యువ బుల్ ఎనర్జీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో టాటా రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ భాగస్వామ్యం కావడాన్ని స్వాగతిస్తున్నాం.

టాటా గ్రూప్, ఏపీ ప్రభుత్వం నడుమ దీర్ఘకాలిక సంబంధాన్ని ఈ ఒప్పందం బలోపేతం చేస్తుంది. పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రానికి దీర్ఘకాలిక ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను ఎంఓయు దోహదపడుతుంది. క్లీన్ ఎనర్జీ విస్తరణను వేగవంతం చేయాలన్నదే మా లక్ష్యం. రాష్ట్రంలో రానున్న అయిదేళ్లలో క్లీన్ ఎనర్జీ రంగంలో రూ .10 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 7.5 లక్షల ఉద్యోగాలు లభిస్తాయి.

స్థలం గుర్తింపు, మౌలిక సదుపాయాల కల్పనలో టాటా రెన్యువబుల్ సంస్థకు పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ మద్దతునిస్తుంది. ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. భారతదేశం క్లీన్ ఎనర్జీ మిషన్కు మద్దతు ఇవ్వడంలో టాటా రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి లోకేష్ చెప్పారు.

టాటా రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ సీఈవో అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపేష్ నందా మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం మాకు సంతోషంగా ఉంది. ఏపీ ప్రభుత్వ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో మా నైపుణ్యం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు ఈ ఒప్పందం మద్దతునిస్తుంది. 7 గిగావాట్ల వరకు స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం వల్ల పునరుత్పాదక ఇంధన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్థానం మరింత బలోపేతమవుతుంది.

భారతదేశ పునరుత్పాదక ఇంధనరంగంలో స్థిరమైన లక్ష్యాలకు దోహదపడుతుంది. రాష్ట్ర సామాజిక-ఆర్థిక వృద్ధికి, బలమైన ఆర్థిక వ్యవస్థకు సహాయకారిగా నిలుస్తుందని దీపేష్ నందా చెప్పారు.

ఈ కార్యక్రమంలో టాటా రెన్యువబుల్ ఎనర్జీ సీఎఫ్వో అమిత్ మిమానీ, గ్రూప్ హెడ్ (ప్లానింగ్ రెన్యువబుల్స్) తాహేర్ లోకానంద్ వాలా, లీడ్ (స్ట్రాటజీ) గరిమా చౌదరి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఎన్ఆర్ఈడీసీఏపీ ఎం.డి కమలాకర్ బాబు, జనరల్ మేనేజర్ (విండ్ & సోలార్) కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించేలా
# బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు

**మొదటి పేజీ తరువాయి..**

తెలిపారు. ఈ మేరకు ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం నాడు జరిగిన కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి సుధీర్ఘ చర్చ జరిగింది. ఈ సంధర్భంగా కేసీఆర్ గారు మాట్లాడుతూ.... దశాబ్దాల పాటు పోరాటాలు నడిపి ఎన్నో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని, అనంతరం పదేండ్ల పాటు ఎంతో అప్రమత్తతో తెలంగాణ స్వరాష్ట్రంలో పాలనను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని, అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం ఇవ్వాల కష్టాల్లో వుందన్నారు.

ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవ వేడుకలు, కేవలం బి ఆర్ ఎస్ పార్టీకే పరిమితం కాదని యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం వుందని స్పష్టం చేశారు. " బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలు నిర్మించుకున్న రాజకీయ అస్థిత్వ పార్టీ. ఇది తెలంగాణ ప్రజల పార్టీ... ప్రజలు బి ఆర్ ఎస్ ను తెలంగాణ పార్టీ గా తమ సొంత ఇంటి పార్టీ గా భావిస్తారు. ప్రజలు ఇవాళ అనేక కష్టాల్లో వున్నారు. వారి రక్షణ బి ఆర్ ఎస్ పార్టీనే అని నమ్ముతున్నారు." అని తెలిపారు. కాంగ్రెస్ ఆశపెట్టిన గ్యారెంటీలను వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఇవాళ రాష్ట్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని తెలుసుకున్నారని, ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బి ఆర్ ఎస్ కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ అన్నారు.

ఈ సందర్భంగా వరంగల్ లో నిర్వహించే భారీ బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని సమావేశంలో ఆశాభావం వ్యక్తమైంది. కాగా .... బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజక వర్గాల వారీగా నిర్వహించాలని అందుకు త్వరలో కమిటీలను వేయనున్నట్టు కేసీఆర్ తెలిపారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం...పార్టీనీ గ్రామ స్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి , ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత... నూతన కమిటీల బాధ్యులతో... ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్టు అధినేత తెలిపారు. కాగా....పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్రంతో పాటు, దేశంలో నడుస్తున్న వర్తమాన రాజకీయ పరిస్థితులపై సమావేశంలో సుధీర్ఘ చర్చ జరిగింది. అందుకనుగుణంగా పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు అమలుచేయాల్సిన రాజకీయ ఎత్తుగడల పై లోతైన చర్చ జరిగింది.

గత ఒడిదుడుకులను అనుభవాలను పరిగణలోకి తీసుకుని వాటిని విశ్లేషిస్తూ, వర్తమానానికి అన్వయించుకుంటూ భవిష్యత్తు కు బాటలు వేసుకునే విధంగా కార్యాచరణను అమలు పరచాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రంలో ఏపార్టీ ప్రభుత్వమున్నకూడా ,తెలంగాణ సమాజానికి మొదటినుంచీ అవి వ్యతిరేకంగానే పని చేస్తున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీనీ పటిష్టం చేసుకొని దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తత తో వుండాలని సమావేశం భావించింది.

తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిథ్యం పార్లమెంటులో లేకపోవడం వలన తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతుందని అంశం పై చర్చ జరిగింది. ఇదే విషయాన్ని ప్రజలకు మరింతగా అర్థం చేయించి పార్లమెంటులో బి ఆర్ ఎస్ ఎంపీ లు ప్రాతినిథ్యం వుండి రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా పలు అంశాలపై చర్చ సంధర్భంగా అధినేత అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు వారి వారి అభిప్రాయాలను అధినేత ముందుంచారు.

దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన సుధీర్ఘ చర్చలో.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ అధ్యక్షతన సాగిన సమావేశం నిర్ణయించింది.

# మంత్రి లోకేష్ చొరవ.. 'పెదవడ్లపూడి' పూర్తి!

**మొదటి పేజీ తరువాయి..**

మిగిలిన 30 శాతం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేసింది. అయిదేళ్ళల్లో 30 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయింది. దీనితో ఐదు సంవత్సరాలు పాటు రైతులు అనేక ఇబ్బందులు పడటంతో పాటు





ఆర్థికంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేష్ ఆ ప్రాంత రైతులకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.


ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల్లోనే ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశారు. దీంతో ఆ ప్రాంత రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు మంత్రి నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. 2018లో 9 కోట్ల రూపాయల అంచనాతో పనులు ప్రారంభించగా. ఇప్పుడు ఆ అంచనా రూ.14.88 కోట్లకు చేరుకున్నప్పటికీ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ నుంచి త్వరితగతిన నిధులు మంజూరు చేయించి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేయించారు. ఈ సందర్భంగా ఎస్.సి వెంకటరత్నం మాట్లాడుతూ త్వరలో మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా హైలెవల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలోని 15 గ్రామాల్లో ఉన్న 25,344 ఎకరాలకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ అనిల్ కుమార్, జేఈ సుభాషిని, ఐడీసీ ఏఈ గోపిచాంద్ తదితరులు పాల్గొన్నారు.

# మా పైసలు.. మాగ్గావాలె!

**మొదటి పేజీ తరువాయి..**

ఖజానా డొల్లతనాన్ని బట్టబయలు చేసింది.

ఉద్యోగులకు సంబంధించిన రూ.8వేల కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నిలదీశారు. ఆయా సంఘాల జేఏసీ నేతలు శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. అత్యవసర బిల్లులతోపాటు మెడికల్ బిల్లులు ఉండటం గర్హనీయమని పేర్కొన్నారు.



ఈ బిల్లుల విడుదలకు పైరవీలు, పర్సంటేజీలతో సంబంధం లేకుండా చెల్లించాలని కోరారు. హెల్త్కార్డులు ఇవ్వాలని, ఐదు డీఏలను చెల్లించాలని, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించిన భట్టి మాట్లాడుతూ.. ఇక ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఏప్రిల్ నుంచి నెలకు 500 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను క్లియర్చేస్తామని హామీ ఇచ్చారు.

టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కల్పించుకొని.. నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు మారం జగదీశ్వర్, కస్తూరి, ముత్యాల సత్యనారాయణగౌడ్, వెంకటేశ్వర్లు, పుల్గం దామోదర్రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, మణిపాల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సచివాలయ ఉద్యోగుల సంఘం తరపున 11 అంశాలను డిప్యూటీ సీఎం భట్టి ముందుంచారు. సప్లిమెంటరీ బిల్లులు, వాహన అద్దె చార్జీలు, మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్లులు, సరెండర్ లీవులు, రిటర్మెంట్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్మెంట్, జీపీఎఫ్, పీఆర్సీ ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

**కాంట్రాక్టర్ల ధర్నాతో బయటకు వెళ్లిపోయిన భట్టి**

వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసేందుకు మధ్యాహ్నం సచివాలయానికి వచ్చారు. డిప్యూటీ సీఎంను కలిసేందుకు ఆయన సెక్యూరిటీ సిబ్బందితో పాటు సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలు చూసే ఎస్పీఎఫ్ సిబ్బంది ఒప్పుకోలేదు.

తమలో కొందరినైనా డిప్యూటీ సీఎంతో కలిపించండి అని వేడుకున్నా సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిన కాంట్రాక్టర్లు ఆయన చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. రేవంత్ సర్కార్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మూడేళ్లుగా తమ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు డబ్బులు ఉంటాయి కానీ తమకు ఇవ్వడానికి లేవా అని నిలదీశారు. త
ˇమ బిల్లులు క్లియర్ చేయడానికి 20 శాతం కమీషన్లు అడుగుతున్నారని, అంత మొత్తం ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. అప్పులు తెచ్చి పనులు చేశామని, వాటికి వడ్డీలు చెల్లించడానికే సతమతమవుతున్న తమకు 20 శాతం కమీషన్లు అడగడం ఏమిటని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల ఆందోళనతో డిప్యూటీ సీఎం భట్టి సెక్రటేరియట్ నుంచి వెళ్లపోయారు.

ఏడాదిన్నర కాలంగా పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు దర్శనాల శంకరయ్య మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్బీ, పీఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల్లో 10 లక్షల లోపు పనులు చేసిన కాంట్రాక్టర్లు సుమారు 6 వేల మంది ఉన్నారన్నారు.

గత కొన్ని నెలలుగా ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావును అనేకసార్లు కలిసి బిల్లులు చెల్లించాలని అడిగితే, రేపుమాపు అంటూ దాటవేస్తున్నారని వాపోయారు.

కాంట్రాక్టర్ల అందరి బిల్లులు 500 కోట్లు ఉన్నాయని, పెద్ద పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు ఇప్పటికే విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేదని, ఉప ముఖ్యమంత్రి వద్దకు వెళ్దామన్నా కనీసం గేటు ముందు కూడా రానివ్వడం లేదన్నారు. ఇప్పటికే అప్పుల పాలయ్యామని ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఈనెల 22 వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, అప్పటికీ చెల్లించకుంటే 25న అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల మోహన్, ప్రధాన కార్యదర్శి రోసెల్లి కిషన్ రావు, ముఖ్య సలహాదారులు కొప్పుల అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు చిందం శ్రీనివాస్, కోశాధికారి పి. రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖకు
# రూ.19,264 కోట్లు

**మొదటి పేజీ తరువాయి..**

శాసనసభకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం ఆఖరు సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కన్నా 30 శాతం మేర ఇది అధికమని, ఆరోగ్య, సంపన్న, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ రూపకల్పనకు ఆరోగ్యశాఖకు పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు చేశారని, 9 నెలల్లో అనేక సంస్కరణలు వైద్య, ఆరోగ్యశాఖలో తీసు కొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఇంటర్ వరకూ 69 మంది లక్షల మంది విద్యార్థులకు హెల్త్ రికార్డుల్ని రూపొందిం చామని మంత్రి వివరించారు.

కోటీ 40 లక్షల మందికి వివిధ రోగాలకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టుల్ని నిర్వహించామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 19 ఆరోగ్య కేంద్రాల్లో ప్రివెంటివ్ క్యాన్సర్పై చికిత్స అందిస్తున్నామన్నారు. స్టెమీ కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కటీ రూ.45 వేల ఖరీదు చేసే ఇంజక్షన్లు ఉచితంగా ఇచ్చి 2,140 ప్రాణాల్ని కాపాడామన్నారు. గతంలో పేదలకు అందుబాటులో లేని ఎంఆర్ఐ స్కాన్ లను కూడా చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ల్యాబులను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. వేతనాలు పెంచాలని ఆశా వర్కర్లు కొందరు ధర్నాలు చేస్తున్నారని, ఏపీలో రూ.10 వేల జీతాన్ని ఆశాలకిస్తున్నామనీ, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచి, రూ.1.50 లక్షలు గ్రాట్యుటీని మంజూరు చేస్తూ ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ని ర్ణయం తీసుకున్నారన్నారని మంత్రి వివరించారు.

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవతో పాటు మందులు, 108 ఎమెర్జెన్సీ సేవలకు సంబంధించి గత ప్రభుత్వం అప్పు పెట్టిందన్నారు. మొత్తం రూ.6,500 కోట్ల మేర బకాయిలు పెట్టి కూటమి ప్రభుత్వంపై భారాన్ని మోపారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ. 2.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వైద్య సేవలందించేలా హైబ్రీడ్ విధానంలో బీమాను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 108 సేవల కోసం కొత్తగా 190 అంబులెన్స్లను , 53 మహాప్రస్థానం అంబులెన్సులను కొనుగోలు చేస్తున్నట్టు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

# మహిళకి వందనం

తల్లి గర్భనా తొమ్మిది నెలలు దాచుకున్నాను... తల దాచుకున్నాను......
నెలలు నిండగా పండు వెన్నెలై భూమికి చేరాను.... ఈ భూమికి చేరాను....


ఏమి తెలియని వింతలోకం నేను చూసాను.... నేను చూసాను.....
ఏమి తోచక చుట్టూ నేను చూస్తూ వున్నాను..... నేను చూస్తువున్నాను.....
నన్ను చూడగా అమ్మ కళ్ళలో నీరు చూసాను.... నే నీరు చూసాను....
హ నీటి విలువ తెలియకుండానే నేను ఏడ్చాను.... నేను బోరున ఏడ్చాను.....

ముద్దు ముద్దుంటూ ముద్దులు పెట్టి నన్ను పెంచింది.....
వద్దు వద్దుంటూ గోలాచేసిన లాలపోసింది.... నాకు జోల పాడింది....
ఆకలి దప్పులు తీర్చింది.... ఆటలు ఎన్నో ఆడింది....
ఊసులు ఎన్నో చెప్పింది...
నా ఊహల్లోనా బతికింది....

ధన్య భూమిలో కన్నతల్లి గా నన్ను చేరింది.....
ఈ పుణ్య భూమిలో వున్నా ప్రేమ నాకు పంచింది....

అమ్మకి వందనం
నా తల్లికి వందనం
మహిళలకి, మాతృమూర్తులకి
మహిళ దినోత్సవ శుభాకాంక్షలు

\- బోడేపూడి నాగమణి



జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

03

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025






# భూమి ఆక్రమించిన బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అనుచరులు!

- గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, సీడ్స్ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి

**మంగళగిరి, మహానాడు:** భూ కబ్జాలతో పాటు వివిధ సమస్యలపై తరలివచ్చిన బాధితుల నుండి ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, సీడ్స్ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డిలు అర్జీలు స్వీకరించి వారి సమస్యలపై అధికార్లతో ఫోన్లలో మాట్లాడి వెంటనే అర్జీ దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- నంద్యాల జిల్లా, డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన కామగానికుంట్ల శేషారెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రోద్భలంతో తనకు తన నానమ్మ ఇచ్చిన గిఫ్ట్ డీడ్ భూమిని కావాలనే ఆన్ లైన్ నుండి తమ పేరును తొలగించి ఇబ్బంది పెట్టారని.. దయ చేసి తమ భూ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాడు.
- సబ్ డివిజన్ కాకపోయినా సబ్ డివిజన్ అయినట్టు చూపించి తన భూమిని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అనుచరులు ఆక్రమించుకున్నారని.. వారి నుండి తమ భూమిని విడిపించాలని నంద్యాల జిల్లా బేతంచర్ల కు చెందిన ఈ. ప్రేమ్ కుమార్ గౌడ్



గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.

- ఏలూరు జిల్లా, మండవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన సంధ్యారణి అనే మహిళ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన అన్న తనకు కానుకగా ఇచ్చిన ఇంటిని గ్రామ సర్పంచ్ సురేష్ బాబు ఆక్రమించుకున్నాడని.. అతని నుండి తమ ఇంటిని విడిపించాలని విజ్ఞప్తి చేశారు.
- నెల్లూరు జిల్లా, ఆల్లూరు మండలం ఆది రాఘవపురం గ్రామానికి చెందిన సీతారావమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తన భర్త చనిపోయాడని.. ఆయన తరువాత తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని తన పేరుమీదకు మార్చాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీలో ఉండే కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి సంబంధించిన భూమిని కొనకొండ్ల వెంకటేష్, రమణ తదితరులు ఆక్రమించుకొన్నారని.. వారి నుండి ఆశ్రమ స్థలాన్నివిడిపించాలని కె. నాగేంద్రాచారి అనే వ్యక్తి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశాడు.
- నంద్యాల జిల్లా, బేతంచర్ల మండలం బనగానపల్లె గ్రామానికి చెందిన మంచినీళ్ల రత్నమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గతంలో తనకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని.. దాన్ని జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణంకు తీసుకోవాలని ఆమె గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చారు.
- కడప జిల్లా, చింతకొమ్మ దిన్నె మండలం నాయనోరి పల్లె గ్రామానికి చెందిన శ్మశాన వాటికను పులివెందులకు చెందిన వ్యక్తి విశ్వనాథ్ రెడ్డి కబ్జా చేసి తమను బెదిరిస్తున్నాడని. అతనిపై చర్యలు తీసుకొని స్మశాన వాటికను కబ్జానుండి విడిపించాలని గ్రామానికి చెందిన వ్యక్తులు కోరారు.
- తన పేరుమీద ఉన్న బండల ఫ్యాక్టరీని వైసీపీ నేతలు ఆక్రమించుకున్నారని.. అయిదేళ్ళుగా వారిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని.. అధికారులు తమ





సమస్యను పరిష్కరించేలా చూడాలని నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు.

- గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 313/1 లో తమకు 1.97 సెంట్ల భూమి ఉందని.. కాని ఆన్ లైన్ లో 88 సెంట్లు మాత్రమే నమోదు చేశారని.. దాన్ని సరిచేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శాసన సభకు జ్వరంతో రామానాయుడు హాజరు!

- ఇరిగేషన్ మంత్రి విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వండి!
- లోకేష్ విజ్ఞప్తి... శాసనసభలో విరిసిన నవ్వుల పువ్వులు

**అమరావతి, మహానాడు:** ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కేవలం పనిపైనే కాకుండా కాస్త ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని మంత్రి లోకేష్ సలహా ఇచ్చారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నిమ్మల జ్వరంతో బాధపడుతున్న విషయాన్ని లోకేష్ ప్రస్తావిస్తూ... రామానాయుడు విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును కోరడంతో శాసనసభలో నవ్వుల పువ్వులు విరిశాయి. విశ్రాంతి తీసుకుంటారా లేక సభ నుంచి సస్పెండ్ చేయించమంటారా అంటూ లోకేష్ చమత్కరించారు. ఆ తర్వాత అసెంబ్లీ లాబీల్లో మంత్రి రామానాయుడు ఎదురుపడినపుడు ఆయన ఆరోగ్యంపై లోకేష్ వాకబు చేస్తూ... ఒక చేతికి సెలైన్ ఇంజెక్షన్ పెట్టుకుని నేడు మరో చేతిలో కాగితాలు పట్టుకుని తిరుగుతూనే ఉంటే ఆరోగ్యం ఏం కావాలని ఆప్యాయంగా ప్రశ్నించారు. నిన్నటి మీద ఈరోజు ఆరోగ్యం బాగానే ఉంది, అందుకే వచ్చానన్న రామానాయుడు సమాధానమిచ్చారు. మాట వినకుంటే నా



యాపిల్ వాచ్ ని మీ చేతికి పెట్టి నిద్రను మానిటర్ చేస్తానని లోకేష్ చెప్పడంతో ఈరోజు సభ అయ్యాక మీ మాట ప్రకారమే విశ్రాంతి తీసుకుంటానని రామానాయుడు అన్నారు.

# దక్షిణాదిలోని ఎంపీ సీట్లపై స్పష్టత ఇవ్వాలని పార్లమెంట్‌లో గళమెత్తాలి

- వైసీపీ ఎంపీలకు ఆ పార్టీ అధినేత జగన్ సూచన

**తాడేపల్లి, మహానాడు:** నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరాదిలో లోక్ సభ స్థానాలు ఎక్కువగా పెరుగుతాయని, ఈ స్థాయిలో దక్షిణాదిలో పెరగవని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. దీనిపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి. అందుకోసం పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తండి' అని తమ పార్టీ ఎంపీలకు వైసీపీ అధ్యక్షుడు జగన్ సూచించారు. 'జమిలి



ఎన్నికలు వస్తే వాటిని బ్యాలట్ విధానంలో చేపట్టేలా పార్లమెంటులో పోరాడాలి. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ బ్యాలట్‌తోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు' అని చెప్పారు. ఈ నెల 10 నుంచి పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో తన క్యాంపు కార్యాలయంలో ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు.

రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టుకు ముందుగా నిర్దేశించిన ఎత్తే ప్రధానం. ఇప్పుడా ఎత్తును తగ్గిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. కేంద్రంలో ఇద్దరు టీడీపీ మంత్రులున్నా పోలవరం ఎత్తు తగ్గింపుపై కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించకపోవడం దారుణం' అని జగన్ విమర్శించారు. 'ఈ విషయంలో టీడీపీ ఎంపీలు స్పందించకపోయినా... రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లేందుకు మేం ప్రయత్నించాం, ఎంపీలంతా కలిసి ప్రధానిని, కేంద్ర మంత్రులను కలుద్దామని కోరినా టీడీపీ ఎంపీలు స్పందించలేదు' అని ఎంపీలు జగన్‌కు తెలిపారు.

పార్లమెంటులో దీనిపైన, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని జగన్ వారికి సూచించారు. 'పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందుబాటులోకి తేవడానికి కొత్త వైద్య కళాశాలలను వైసీపీ హయాంలో తీసుకొచ్చాం. ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోంది. ఈ అంశాన్నీ పార్లమెంటులో గట్టిగా ప్రస్తావించాలి' అని చెప్పారు.

# అవినీతే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేసింది

- మాజీమంత్రి ప్రత్తిపాటి



**అమరావతి, మహానాడు:** పేదలందరికీ ఇళ్లు, సెంటు పట్టాల పంపిణీతో నివాసయోగ్యానికి వీలుకాని భూముల్ని, కొండలు..గుట్టలు... వాగులు.. కుంటల పక్కన 33 లక్షల ఇళ్లపట్టాల పంపిణీ ముసుగులో వైసీపీ ప్రభుత్వం రూ.7,800 కోట్లకు పైగా అవినీతికి పాల్పడిందని మాజీమంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. పేదల సొంతింటి కల సాకారం చేసే సదుద్దేశానికి విరుద్ధంగా జగన్ సర్కార్ వ్యవహరించిందని, కేంద్రప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ నిధులకు సమానంగా రాష్ట్ర వాటా ఇవ్వకుండా మొక్కుబడిగా ఇళ్ల నిర్మాణం పేరుతో జగన్ ప్రభుత్వం ప్రజల్ని వంచించిందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం.. సెంటు పట్టాల పంపిణీ అంశంపై శుక్రవారం ఆయన సభలో మాట్లాడారు.

చిలకలూరిపేట నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రిపై సొంతపార్టీ వారే కోర్టుకు వెళ్లారు...పేదల ఉసురు తగిలే వైసీపీ 11 సీట్లకు పరిమితమైంది.. పనికిరాని భూముల్ని పేదలకు ఇళ్ల పట్టాలుగా ఇవ్వడమేగాక, భూమిచదును పేరుతో వేలకోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర వైసీపీప్రభుత్వానిదేనని పుల్లారావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లనిర్మాణంపై దృష్టి సారించిందన్నారు. ఆ క్రమంలో రూ.643కోట్లు ఖర్చుచేసి, దాదాపు లక్షా14వేలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిం దన్నారు. గతంలో టీడీపీప్రభుత్వ హాయాంలో 95శాతం వరకు పూర్తైన టిడ్కోఇళ్ల నిర్మాణాన్ని కూడా వైసీపీప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారని దుయ్యబట్టారు.

# మంచినీటి సమస్యలకు తక్షణమే పరిష్కారాలు చూపాలి

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** నియోజకవర్గంలో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, వేసవి దృష్ట్యా సాధ్యమైనంత మేరకు ముందే మేల్కొని చర్యలు చేపట్టాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో బొల్లాపల్లి మండలం దోమలగుండం, రేమిడిచర్ల, గండిగనుమల, అయ్యన్నపాలెం గ్రామాల్లో ప్రస్తుతం మంచినీటికి ఇబ్బందిగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్న ఆయన ఆ మేరకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా రాబోయే రోజుల్లో 16 పంచాయతీల్లో ఎక్కడా కూడా ఇబ్బంది లేకుండా మంచినీరు అందించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం అధికారులతో ఫోన్ లో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. మంచినీటికి సంబంధించి ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని పల్నాడు కలెక్టర్‌ను కోరారు. అవసరాల మేరకు సరఫరా అవుతుందా లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.



# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉత్తిదేనా?

- మహిళలకు బస్సు ప్రయాణంలో నిబంధనల కోత
- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి



**విజయవాడ, మహానాడు:** ఏరు దాటేంత వరకు ఓడ మల్లన్నా.. దాటాక బోడి మల్లన్నలా ఉంది కూటమి ప్రభుత్వ తీరు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ..ఫ్రీ అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టి, ఓట్లు వేయించుకొని, ఇప్పుడు కండీషన్ అప్లై అనడం దారుణమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. జిల్లా స్థాయి వరకే పథకాన్ని పరిమితం చేస్తామని చెప్పడం మోసం.

అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేక చెప్పే సాకులు. ఆదిలోనే యూటర్న్ తీసుకోవడం అంటే ఇదే మరి అని ఆమె దుయ్యబట్టారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది నెలలు దాటినా ఉచిత ప్రయాణం కల్పించకుండా మహిళలను మోసం చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేశారు. రాష్ట్రాల పర్యటన పేరుతో విహార యాత్రలు చేశారు. పథకం అమలుకు ముందే ఇన్ని నిబంధనలు పెట్టే ఈ ప్రభుత్వం.. రేపు అమల్లోకి తెచ్చే సరికి నియోజక వర్గం, మండల స్థాయి వరకే ఫ్రీ అంటారేమో. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు రాష్ట్రమంతా ఉచిత ప్రయాణమే. పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో ఎక్కడినుంచి ఎక్కడికైనా అంతా ఉచితమే. ఆధార్ కార్డు చూపిస్తే చాలు ఎంతదూరమైనా జీరో టికెట్.

ఇలాంటి మంచి పథకాన్ని, అతి తక్కువ ఖర్చుతో మహిళలకు మేలు జరిగే హామీని .. అమలు చేయడానికి కూటమి ప్రభుత్వానికి ఇంకా మనసు రావడం లేదు. నెలకు రూ.350 కోట్లు మహిళల కోసం ఆర్టీసికి ఇవ్వడానికి ధైర్యం చాలడం లేదు.

మహిళలకు భద్రత కల్పించే విషయంలో కూడా లాభనష్టాలు చూడాలా? ఇదేనా కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న మహిళా సాధికారిత? తక్షణం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని.. రాష్ట్రం అంతా ఉచిత ప్రయాణం సౌకర్యం ఉండాలని రాష్ట్రంలోని మహిళల పక్షాన కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

# దృశ్యం సినిమాలా వివేకా హత్య సాగదీస్తున్నారు..

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి

**మంగళగిరి, మహానాడు:** వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి అనేక ఏళ్ళు గడుస్తున్నప్పటికి ఇప్పటికీ దోషులకు శిక్ష పడలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డి గుర్తు చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేకానంద రెడ్డి హత్య కేసు దృశ్యం సినిమా వలే సాగుతూనే ఉంది. ఇటీవల జరిగిన ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న మృతి వివేకా హత్య కేసుకు సంబంధించి అనేక అనుమానాలకు తావిస్తోంది. పరిటాల రవి హత్య కేసులో వరుస మరణాలు చూసినట్లే వివేకా హత్య కేసులోనూ నిందితుల మరణాలు కొనసాగుతున్నాయి. వివేకా హత్య కేసులో ఇప్పటికే కసనూరు శ్రీనివాస్ రెడ్డి, కువైట్ గంగాధర్ రెడ్డి, డ్రైవర్ నారాయణ, ఈసీ గంగి రెడ్డి, అభిషేక్ రెడ్డి వంటి కీలక వ్యక్తులు మృతి చెందారు. యువకుడైన అభిషేక్ రెడ్డి నాలుగు నెలలు కోమాలో ఉండి మరణించారు. ఇలా మరణించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

2019లో 'నారసుర రక్త చరిత్ర' అంటూ కట్టుకథలు అల్లి వైసీపీ అధికారంలోకి వచ్చింది. హత్యలు చేయడం, కట్టుకథలు అల్లడం జగన్ రెడ్డికి అలవాటు. పోలీసుల వేధింపులు తట్టుకోలేకే రంగన్న మృతి చెందారని సాక్షిలో దుష్ప్రచారం చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని వివేకా హత్య కేసు ముఖ్య సాక్షి రంగన్నను హింసించింది. సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దస్తగిరి గోడ దూకి పారిపోగా, ఎర్రగంగిరెడ్డి మాత్రం ప్రధాన ద్వారం ద్వారా బయటకు వచ్చాడు. ఈ విషయం వెల్లడిస్తే చంపేస్తామని బెదిరించారని రంగన్న వాంగ్మూలమిచ్చారు. వాచ్‌మెన్ రంగయ్య మృతి అత్యంత అనుమానానికి తావిస్తోంది. ఈ మరణాల వెనకున్న మిస్టరీలను సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను బహిర్గతం చేయాల్సివుంది. 2019లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యి ఉంటే, ఇప్పటికే దోషులను పట్టుకుని ధర్మాసనం ముందు నిలబెట్టేవారు. రాజకీయ అధికారం కోసం సొంత బంధువులే వివేకానంద రెడ్డిని హత్య చేశారనే విషయం రాష్ట్ర మొత్తానికి తెలుసు.

ఈ కేసును సీబీఐ టేక్ అప్ చేసింది. వివేకా కుమార్తె సునీత కూడా న్యాయం జరగాలని న్యాయ పోరాటం చేస్తునే ఉన్నారు. సాక్షి పత్రిక ఎంత హుషారుగా రాస్తుందంటే పోలీసుల వేధింపులు తాళలేక, పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక వాచ్‌మెన్ రంగన్న చనిపోయినాడని రాశారు. వాచ్మెన్ రంగన్నను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులు తీసుకువెళ్లి ఆయనను అనేక రకాలుగా చిత్ర హింసలు పెట్టారు. వైసీపీ నాయకులు చెప్పినట్టు మాట్లాడాలని చెప్పి చిత్రహింసలు పెట్టిన విషయం వాస్తవం కాదా? కాగా నేడు పోలీసులు వేధించారనడం శుద్ధ అబద్ధం. ఈ కేసులో గతంలో అయిదేళ్ళు మీరు అధికారంలో ఉన్నప్పుడు ఇదే వాచ్‌మెన్ రంగన్నను మీ చేతిలో ఉన్న పోలీసుల చేత వేధింపులు చేసి చిత్ర హింసలు పెట్టారు. వైసీపీ నాయకులు చెప్పినట్టుగా మీరు చెప్పమన్న విషయం అక్షరాల నిజం. ప్రజలను మభ్య పెట్టడానికి ఏదంటే అది మాట్లాడడం సబుకాదు.

ఇప్పటికి ఆరు ఏడు ఏళ్ళు అయింది ఇంకా ఎన్ని రోజులు ఈ కేసును సాగదీస్తారు? ఈ విధంగా దీన్ని డ్రాగ్ ఆన్ చేసి సాక్షులు నిజమైన దోషులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రంగన్న మృతి జరిగిన సంఘటన చూస్తే అన్ని రకాల అనుమానాలు తావిస్తోంది. వరుసగా ఐదారు మంది చనిపోయారు. చివరికి ఎంతమంది చనిపోతారో తెలియదు. వాచ్‌మెన్ రంగన్న మృతదేహానికి పూర్తి స్థాయి పోస్ట్ మార్టం జరగాలి. ఎక్కడ అనుమానాలకు విధంగా తావు లేని విధంగా పోస్ట్ మార్టం జరగాలి. జిల్లా పోలీసు, రాష్ట్రంలో ఉన్న ఇంటెలిజెన్స్ వ్యవస్థ కూడా పూర్తి పర్యవేక్షణ చేయాలి. ఈ కేసులో నిజమైన దోషులను పట్టి శిక్షించాలి. ఎఫ్ ఐఆర్ లో ఉన్న ఆ నిందితులను కూడా ఈ మృతి చెందిన విషయంలో విచారించాలి. పోలీసులు ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఈరోజు ఉన్న అధికారంలో ఉన్న పార్టీ మా పార్టీ అయినా కూడా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలి. గతంలో ఉన్న ముద్దాయిలు ఎవరైతే ఈ కేసులో ఉన్నారో వాళ్ళందరిని కూడా విచారించాలి. మళ్ళీ ఈరోజు కొత్తగా పోలీసులు వేదింపులు తట్టుకోలేక రంగన్న చనిపోయాడు అని మాట్లాడడం అవివేకం. ఒక అభూత కల్పనలు తయారు చేసి అబద్ధాలను నిజాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



సాక్షి మీడియా ఉందని చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయనే విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్ళు గ్రహించాలి. వైఎస్సార్ కాంగ్రెస్ కుటుంబానికి చెందిన కీలక సాక్షి దగ్గర బంధువు అభిషేక్ రెడ్డి కూడా ఇటీవలనే హైదరాబాద్ లో చికిత్స పొందుతూ చనిపోయాడు. హత్య జరిగిన రోజు వివేకానంద రెడ్డి గారి ఇంట్లో రక్తపు మరకలు తుడవడం, మృత దేహానికి కుట్లు వేసిన విధానం ఇంట్లో ఎవరెవరు ఉన్నారనే విషయాల పైన కూడా సిబిఐ కి ఆల్రెడీ వాంగ్మూలం ఉంది. యువకుడైన అభిషేక్ రెడ్డి నాలుగు నెలలు కోమాలో ఉండి చనిపోయాడంటే ఇది అనుమానాస్పద మృతి కాదా? వాచ్‌మెన్ రంగన్న హత్య చేసి పారిపోయిన నిందులను కళ్లారా చూశాను అని చెప్పి ఆయన చెప్పిన విషయం కూడా గుర్తు చేసుకోవాలి. ఈ సంఘటనలో ఎర్రగంగి రెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దస్తగిరి ప్రమేయాన్ని కూడా మ్యాజిస్ట్రేట్ కోర్టులో చెప్పడం కూడా రికార్డ్స్ అన్ని ఒకసారి చూడాలి.

సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దస్తగిరి గోడ దూకి పారిపోగా ఎర్రగెంగిరెడ్డి మాత్రం ప్రధాన ద్వారం నుంచి బయటికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయం బయటికి చెబితే చంపేస్తామని తనను బెదిరించినట్టు రంగన్న వాంగ్మూలం కూడా ఇచ్చి ఉన్నాడు. ఇలా అనేక వాంగ్మూలాలు ఉన్నాయి. ఈ కేసులోని నిందితులను సరెండర్ అయ్యి వాస్తవాలు మేజిస్ట్రేట్ ముందు వివరించారు. 2019లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయి ఉండి కూడా దోషులను పట్టుకొని ధర్మాసనం ముందు నిలబెట్టగలిగే వారు. పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. దీన్ని రాజకీయం చేయడం మంచిది కాదని ఒక పెద్ద హృదయంతో చంద్రబాబు నాయుడు నాడు ఈ కేసు మీద దృష్టి పెట్టలేదు. చట్టం తన పని తాను చేసుక పోతుందని చెప్పారు. దోషులు మాత్రం ఎప్పటికప్పుడు ఈ కేసు నుంచి బయట పడేందుకు, తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

వివేకాను హత్య చేసింది సొంత బంధువులే. వీళ్ళందరూ కూడా కుటుంబంలో చిచ్చు పెట్టుకొని ఒకరినొకరు ఆ రాజకీయ ఆధిపత్య పోరులో వివేకానంద రెడ్డిని బలి చేశారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు అందరికీ తెలుసు. వాచ్‌మెన్ రంగన్న మృతి పైన పూర్తి స్థాయి పోస్ట్ మార్టం సీనియర్ డాక్టర్ల నేపథ్యంలో జరగాలి. జిల్లా పోలీసులు, రాష్ట్రంలో ఉన్న ఇంటెలిజెన్స్ వ్యవస్థ పూర్తి స్థాయిలో కేసును విచారించాలి. ఈ కేసులో ఎవరైతే నిందితులను ఉన్నారో ఆల్రెడీ వారిని కూడా విచారిస్తే మరిన్ని వాస్తవాలు బయటకు రాగలవు. దృశ్యం సినిమా వలే ఈ కేసు ముగిసిపోకుండా వాస్తవాలు బయటకు రావాలి. నిజమైన దోషులకు శిక్ష పడాలని పోలీసులను, ఇంటెలిజెన్స్ వ్యవస్థను, ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆర్.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025 ||




# ‘వెలిగొండ’పై కూటమి కుట్ర!

◆ వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆగ్రహం

**తాడేపల్లి, మహానాడు:** మూడు జిల్లాలకు వరప్రదాయినిగా నిలుస్తున్న వెలిగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కేవలం రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే వెలిగొండ ప్రాజెక్ట్‌కు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కేవలం రూ.359 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. ఏకంగా 53 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు.

ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం ప్రాంతంలో నెలకొన్న నీటి ఎద్దడి, కరవు పరిస్థితులను ఐక్యరాజ్యసమతి వంటి అంతర్జాతీయ సంస్థలే గుర్తించాయి. ఈ కరవు పరిస్థితులను మార్చేందుకు నిర్దేశించిన వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించింది. ఈ ప్రాజక్ట్ పనులు శరవేగంతో చేయడం వల్ల శ్రీశైలం నుంచి నీటిని తీసుకురావడానికి నిర్మించిన రెండు టన్నెల్స్ పనులు పూర్తయ్యాయి. దానిలోని మట్టిని మాత్రం తొలగించాల్సి ఉంటుంది. అలాగే స్టోరేజీ చేసే కొండల మధ్య ఉన్న గ్యాప్‌లను పూడ్చడం జరిగింది. పునరావాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారని తెలిపారు.

గతంలో పునరాసానికి రూ.1.80 లక్షలు ప్రకటిస్తే, జగన్ వచ్చిన



తరువాత రూ.12.5 లక్షలు ప్రకటించారు. ఈ ఏడాది జనవరి వరకు ఎవరికైతే 18 ఏళ్ళు నిండి ఉంటాయో వారికి పరిహారం ఇచ్చి, ముంపు ప్రాంతాల నుంచి తరలించాల్సి ఉంది. ఇదే జరిగితే 53 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో నీరందుతుంది. శ్రీశైలంలో 45 రోజుల పాటు వచ్చే నీటిని ఇక్కడికి తీసుకువచ్చి, కరవును దాదాపు రూపుమాపవచ్చని అన్నారు.

# ఏఐ, ఆధునిక సాంకేతిక అనుసంధానంతో పాలనలో వేగవంతం

◆ వాద్వానీ ఫౌండేషన్ తో ప్రభుత్వ అవగాహన ఒప్పందం


◆ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇరుపక్షాల నడుమ ఎంఓయు

**అమరావతి, మహానాడు:** పరిపాలనలో ఎమర్జింగ్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో వేగం సాధించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వాద్వానీ ఫౌండేషన్ నడుమ అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో కృత్రిమ మేధ ఆధారిత సర్వీస్ డెలివరీ ట్రాన్స్ ఫర్మేషన్, పాలసీ మేకింగ్, కెపాసిటీ బిల్డింగ్ ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), జనరేటివ్ ఏఐ, డ్రోన్లు, ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలు వివిధ ప్రభుత్వ విధుల్లో సమర్థవంతంగా వినియోగానికి ఈ ఒప్పందం దోహదపడుతుంది. ఏపీ ప్రభుత్వం తరపున ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, వాద్వానీ ఫౌండేషన్ తరపున వాద్వానీ సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ (డబ్ల్యుజిడిటి) సిఇఒ ప్రకాశ్ కుమార్ లు ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పాలనా ఆవిష్కరణలకు ఒక బెంచ్ మార్క్‌గా మారనుంది, విధాన రూపకల్పన, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం కృత్రిమ మేధ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ద్వారా మెరుగైన పౌర సేవల పంపిణీకి తాజా ఒప్పందం మార్గం సుగమం చేస్తుంది.


ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఏఐ వినియోగం ద్వారా పౌరసేవలు, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉందని తెలిపారు. ఏఐ ఆధారిత పాలసీ ఫ్రేమ్ వర్క్ ను నిర్మించడానికి, సర్వీస్ డెలివరీని మెరుగుపరచడానికి, అధునాతన డిజిటల్ నైపుణ్యాలతో కూడిన శ్రామిక శక్తిని నిర్మించడానికి వాద్వానీ ఫౌండేషన్ సహకరిస్తుందని లోకేష్ చెప్పారు.

వాద్వానీ ఫౌండేషన్ డబ్ల్యుజిడిటి సిఇఒ శ్రీ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ... పాలనా పరివర్తనలో ఒక మార్గదర్శక దశను ఎఐ వినియోగంతో రూపొందించడమే ఈ ఒప్పందం లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులను నైపుణ్యవంతం చేసి, తద్వారా పౌరసేవలను మెరుగుపర్చేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచేందుకు మా వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



### ఎంవోయూ ముఖ్యాంశాలు

- డ్రైవింగ్ సర్వీస్ డెలివరీ ట్రాన్స్ ఫర్మేషన్ – పాలనా ఫలితాలను మెరుగుపరచడానికి, సేవా సామర్థ్యాన్ని పెంచడం, డిజిటల్ అంతరాన్ని భర్తీచేయడానికి ఇప్పటికే ఉన్న అప్లికేషన్‌లలో ఏఐని ఇంటిగ్రేట్ చేయడం.
- పాలసీల రూపకల్పనలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం – డేటా విశ్లేషణ ద్వారా ఉత్పన్నమయ్యే లోతైన అంతర్ దృష్టి విధాన నిర్ణయాలను మెరుగుపర్చి తద్వారా పాలనలో సులభతర విధానాలను అమలుచేయడం.
- ప్రోగ్రామ్‌లు, స్కీమ్‌ల సమీక్ష – ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ఆప్టిమైజ్ చేయడానికి ఏఐ, డిజిటల్ పరిష్కారాలను వర్తింపజేయడం,. వాటిని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా పౌర కేంద్రీకృతంగా మార్చడం.
- ప్రభుత్వ పాలనా సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో ఇది కీలకమైన తొలి అడుగు. రాష్ట్రవ్యాప్త ప్రభుత్వ వ్యవస్థ పునర్నిర్మాణానికి ఈ నూతన విధానాలను అమలుచేస్తారు. పరిపాలనలో డిజిటల్ పరివర్తన కోసం ఏఐని ఉపయోగించుకోవడానికి అవసరమైన నైపుణ్యంతో ఎఐ బూట్ క్యాంప్ ప్రభుత్వ అధికారులను సన్నద్ధం చేస్తుంది. రాష్ట్రవ్యాప్త డిజిటల్ లెర్నింగ్ యాక్సెస్ లో భాగంగా ఏఐ ఆధారిత ఆన్లైన్ కోర్సులు, అభ్యాస వనరులను ఈ నూతన విధానాన్ని ప్రభుత్వం వినియోగిస్తుంది.
- కృత్రిమ మేధ, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విద్యను అన్ని స్థాయిలలో ప్రభుత్వ ఉద్యోగులకు అందుబాటులో ఉంచుతుంది. ఆంధ్రప్రదేశ్ పాలనా చట్రంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను సమర్థవంతంగా స్వీకరించడం, ప్రభావాన్ని నిర్ధారించడానికి ఎపి ప్రభుత్వం, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా తమ నైపుణ్యం, వనరులను పెట్టుబడిగా పెడతాయి.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025



## వైసీపీని వీడి టీడీపీలోకి రామచంద్రాపురం సర్పంచ్



**దర్శి, మహానాడు:** దర్శి మండలం, రామచంద్రాపురం గ్రామ సర్పంచ్ కర్ణ సుబ్బులు వైసీపీని వీడి టీడీపీలో చేశారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నివాసం వద్ద శుక్రవారం సుబ్బులుకు లక్ష్మి టీడీపీ కండువా వేసి, పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీటీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తదితరులు ఉన్నారు.

## దొంగల ముఠాకి కేరాఫ్ వైసీపీ

◆ గాదె వెంకటేశ్వరరావు

**గుంటూరు, మహానాడు:** రాష్ట్రంలో వైసీపీ పార్టీలో విదూషకుడిగా మారిపోయి అంబటి రాంబాబు నీతి వాక్యాలు చెబుతున్నారని, మొన్న జగన్మోహన్ రెడ్డి పవన్ కల్యాణ్ గురించి మాట్లాడటం, నిన్న అంబటి రాంబాబు మంత్రి నాదెండ్ల మనోహర్ గురించి మాట్లాడటం చూస్తే మతి వుండే మాట్లాడుతున్నారా అని అనుమానం కలుగుతోందని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె




వెంకటేశ్వరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన లాడ్జి సెంటర్లో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడారు. వైసీపీ పార్టీ ఎమ్మెల్యేలు, జగన్ ఎవరవరో రాసిన పేపర్లు చదువుతూ ఏదో నోరుజారీ మాట్లాడిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీనిపై అంబటి రాంబాబు ఏదో మహా నీతి మంతుడు లాగా మాట్లాడటం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని అన్నారు.

వైసీపీ నాయకులకు అసెంబ్లీలో మాట్లాడడానికి అవకాశం ఉందని, వారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని అలాంటి వ్యక్తులు బడ్జెట్ గురించి మాట్లాడితే అసెంబ్లీలో మాట్లాడాలి కానీ బయట మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లి బడ్జెట్ మీద లేదా వారి వారి నియోజకవర్గాలు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని మాట్లాడే ప్రయత్నం కూడా కనీసం చేయట్లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బిట్రగుంట మల్లిక, జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ శిఖా బాలు, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, నక్కల వంశీ, 47వ డివిజన్ కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

## యూజర్ల కోసం గూగుల్ సరికొత్త ఆప్షన్

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆండ్రాయిడ్ యూజర్లకోసం గూగుల్ కొత్తఫీచర్లను తీసుకొచ్చింది.

మోసపూరిత సందేశాలు పెరుగుతున్న నేపథ్యంలో తన మెసేజింగ్ యాప్‌లో వాటిని గుర్తించి బ్లాక్ చేసే సదుపాయాన్ని తీసుకొచ్చింది. దీంతోపాటు ఫైండ్ మై




డివైజ్ యాప్ ద్వారా లొకేషన్ షేరింగ్, బ్రౌజర్లో ఫైస్ ట్రాకింగ్ వంటి సదుపాయాలను కల్పించింది. ఎస్ఎంఎస్, ఎంఎంఎస్, ఆర్‌సీఎస్‌ల ద్వారా వచ్చేసందేశాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో గుర్తిస్తుంది.

## బిఎడ్ పరీక్షా పత్రం లీకేజిపై ప్రభుత్వం సీరియస్

◆ సమగ్ర విచారణకు మంత్రి లోకేష్ ఆదేశం

**అమరావతి, మహానాడు:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బిఎడ్ పరీక్షా పత్రం లీకేజి అంశాన్ని ప్రభుత్వం సీరియస్ గా పరిగణిస్తోంది. మధ్యాహ్నం రెండు




గంటలకు జరగాల్సిన ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్?మెంట్ పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రం నిర్ణీత సమయానికి ముందే లీక్ కావడంపై విచారణ నిర్వహించాల్సిందిగా ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించాం. అలాగే పరీక్షను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇటువంటి సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యాశాఖ అధికారులను కోరుతున్నట్టు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.

## శ్రీనివాస కల్యాణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**గుంటూరు, మహానాడు:** అమరావతి వేంకటపాలెంలో ఈ నెల15వ తేదీన శ్రీనివాస కల్యాణోత్సవం జరగనుంది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె శ్యామలరావు శుక్రవారం తెలిపారు. ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించామని, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ లను సమన్వయం చేసుకుంటూ ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ వినయ్ చంద్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాల పునఃవ్యవస్థీకరణపై ప్రతిపాదనల్లేవ్!

◆ పరిశీలనలో అద్దంకి, మడకశిర రెవెన్యూ డివిజన్‌లు

◆ కొత్త జిల్లాల ఏర్పాటును గందరగోళంగా మార్చిన వైసీపీ ప్రభుత్వం

◆ శాసన మండలిలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, మహానాడు:** ప్రస్తుతానికి జిల్లాల పునఃవ్యవస్థీకరణకు సంబంధించి ప్రభుత్వం వద్ద గాని, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ పరిశీలనలో గాని ఎటువంటి ప్రతిపాదనలు లేవని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కొత్తగా రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించి రెండు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లే మూడు రెవెన్యూ డివిజన్లను సవరించి అద్దంకి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆ జిల్లా కలెక్టర్ నుండి ప్రతిపాదన వచ్చిందన్నారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా లోని మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలంటూ ఆ జిల్లా కలెక్టర్ నుండి కూడా నివేదిక వచ్చిందని చెప్పారు. ఈ రెండు డివిజన్ల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు.

కాగా ఎమ్మిగనూరు, ఉదయగిరి కేంద్రాలను కూడా రెవెన్యూ డివిజన్లుగా మార్చాలని స్థానిక శాసన సభ్యుల నుండి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. శుక్రవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లాల పునఃవ్యవస్థీకరణపై సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జిల్లాల విభజనను అస్తవ్యస్తంగా చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా నిర్ణయాలు జరిగిన కారణంగానే



చాలా చోట్ల నిరసనలు జరిగాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో అనేక ప్రజా సమస్యలతో పాటు ఉద్యోగుల ఆందోళన, పీఆర్సీ అంశాలను పక్కదారి పట్టించేందుకే జగన్ రెడ్డి జిల్లాల విభజనను తెరపైకి తీసుకువచ్చారన్నారు.

కనీసం కేబినెట్ లో కూడా సమగ్రంగా చర్చించకుండా రాత్రికి రాత్రి నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అశాస్త్రీయంగా చేసిన కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితి తెచ్చారన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు పలు చోట్ల గందరగోళంగా తయారయ్యాయని, భౌగోళికంగానూ ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సంబంధంలేని ప్రాంతానికి మన్యం జిల్లా పేరుపెట్టడం, విజయవాడలో కలిసి ఉన్న ప్రాంతాలను మచిలీపట్నంలో కలపడం, రాజంపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టినా.. జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రతిపాదించడం వంటి అనేక గందరగోళాలు చోటు చేసుకున్నాయన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం నియోజకవర్గాలను, డివిజన్లు, మండలాలను ఇష్టానుసారంగా మార్చేశారన్నారు. 2022లోనే కొత్త జిల్లాలపై నిర్ణయం తీసుకున్నప్పటికీ జగన్ రెడ్డి గద్దె దిగేంత వరకు కూడా కొత్త జిల్లా కేంద్రాలను కుర్చీ, బల్లలు లేకుండానే నడిపారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాల్లో మౌలిక సదుపాయలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లాల ఏర్పాటు సమయంలో పారదర్శకంగా, సమగ్రంగా వ్యవహరించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉద్యమాలు చెలరేగాయన్నారు. ముఖ్యంగా కొనసీమ జిల్లా పేరు మార్పుపై ఆ జిల్లా అంతటా పెచ్చరిల్లిన ఉద్యమం హింసాత్మకంగా మారిందన్నారు. నాలుగు రోజుల నుండి ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపినా పరిస్థితిని అంచనా వేసి హింస చెలరేగకుండా ఆపడంలో అప్పటి జగన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని అన్నారు.

# సంగీత ప్రియులను కలవడం అదృష్టంగా భావిస్తున్నా..

◆ ప్రముఖ సింగర్ సునీత

**విజయవాడ, మహానాడు:**

సంగీతం అంటే ఇష్టపడే వారిని కలవటం ఒక గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ సింగర్ సునీత అన్నారు. బి.ఎస్.పి గోల్డ్ అండ్ డైమండ్స్ సమర్పణలో కాత్యా అండ్ కశ్వీక్ ఎంటర్టైన్మెంట్స్ అండ్ అనూప్ ఈవెంట్స్ వారి సునీత ఉపదృష్ట లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదోతేదీన శనివారం మహిళా దినోత్సవం రాత్రి సికె కన్వెన్షన్ హాలులో మ్యూజిక్ షో నిర్వహించనున్నారు.

దీనికి సంబంధించి వివరాలను ఆమె కన్వెన్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11:00 వరకు షో జరుగుతుందని చెప్పారు. మంచి పాటలు విని జ్ఞాపకాలను గుండెల్లో పదిలుపరచుకొని వెళ్లాలని తెలిపారు.

మహిళా దినోత్సవంపై స్పందిస్తూ ప్రతిరోజు మహిళా దినోత్సవమేనని అన్నారు. మహిళలు లేకపోతే రోజు గడవడం కష్టమని తెలిపారు. భౌతికంగా వేరైనా అందరూ ఒకటేనని అన్నారు. ఈ ప్రాంతానికి వచ్చిన సమయంలో చిన్నప్పుడు విజయవాడ, గుంటూరులో సంగీతం నేర్చుకున్న నాటి తాలూకు జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని అన్నారు. ఆరోజులతో పోల్చుకుంటే నేడు ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. బి.ఎస్.పి గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధి పొన్నూరు రామ్ కుమార్, మాట్లాడుతూ ఆరోజు సాయంత్రం 6:30 గంటలకు మ్యూజిక్ షో ప్రారంభమవుతుందని 11 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరి శ్రీరామ్, డి జయ నరసింహారావు, ప్రజాపతి దీపక్, గుడవల్లి జయప్రకాష్, జాత్యా అండ్ కాశ్వీక్ ఎంటర్టైన్మెంట్స్ ప్రతినిధి భోగినేని కాశీ రావు, అనూప్ ఈవెంట్స్ ప్రతినిధి మెండు అనూప్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఐఐటీ హైదరాబాద్‌తో బొగ్గు, గనుల శాఖ ఒప్పందం

◆ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో ఎంఓయూ

**హైదరాబాద్, మహానాడు:** ఐఐటీ హైదరాబాద్‌లో రూ.98 కోట్లతో బొగ్గు, గనుల శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కోలిండియా, ఐఐటి హైదరాబాద్ మధ్య ఒప్పందం కుదిరింది. బొగ్గు రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి పరిశోధనలకు పెద్దపీట వేసేందుకు, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ కింద స్వతంత్ర ఆర్ అండ్ డి వ్యవస్థను ఏర్పాటు చేయాలనేది కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆలోచన. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. దేశంలో బొగ్గు ప్రాధాన్యత పెరుగుతూ వస్తోంది. అన్ని రంగాల్లో, భారత దేశ అభివృద్ధిలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తోంది. 72 శాతం విద్యుత్ మన దేశంలో బొగ్గు ద్వారానే ఉత్పత్తి





చేసుకుంటున్నాం. స్టీలు, సిమెంట్, అల్యూమినియం, పేపర్, టెక్స్ టైల్, హెవీ ఇండస్ట్రీ రంగాల్లో బొగ్గు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. బొగ్గు ఉత్పత్తిలో భారత దేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. బొగ్గు వినియోగంలో ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉంది.

బొగ్గు నిల్వల విషయానికొస్తే 5వ స్థానంలో ఉంది. కోలిండియా ప్రపంచంలోనే నంబర్ వన్ కంపెనీ. బొగ్గు ఉత్పత్తి ద్వారా అనేక రాష్ట్రాల్లో రెవెన్యూ అందజేస్తున్నాం. రైల్వే శాఖలో బొగ్గు రవాణా ద్వారా 50 శాతం ఆదాయం సమకూరుతోంది. క్లీన్ కోల్ ఎనర్జీ, నెట్ జీరో కర్బన ఉద్గారాలు లక్ష్యంగా సరికొత్త సాంకేతికత అభివృద్ధి చేసేందుకు సెంట్రల్ మైన్ ప్లానింగ్ డిజైన్ ఇన్ స్టిట్యూట్ ద్వారా పరిశోధన పెంచాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందులో భాగంగా నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ ను ఏర్పాటు చేశాం. దేశంలోని ఐఐటీలతో కలిసి ఈ సెంటర్ పనిచేస్తుంది. ఇందులో భాగంగా క్లీన్ కోల్ ఎనర్జీ, నెట్ జీరో పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఐఐటీ హైదరాబాద్ స్థాపించింది.

క్లీన్ కోల్ టెక్నాలజీ, బొగ్గు వినియోగంలో ఆధునిక సాంకేతిక అభివృద్ధి చేసే విషయంలో ఐఐటీ హైదరాబాద్ తో ఎంఓయూ చేసుకున్నాం. నెట్ జీరో లక్ష్యాలను చేరుకునేందుకు కటింగ్ ఎడ్జ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, సుస్థిరంగా బొగ్గును ఎలా వినియోగించుకోవాలనే దానిపై ఐఐటీ పనిచేస్తుంది. భారత దేశంతో పాటు ప్రపంచ దేశాలకు క్రిటికల్ మినరల్స్ అవసరం ఉంది.

క్రిటికల్ మినరల్స్ ను గుర్తించేందుకు ఐఐటీ హైదరాబాద్ కూడా సాంకేతిక సాయం అందజేస్తుంది. కోలిండియా ఉద్యోగులకు కూడా సమీప భవిష్యత్తులో ఐఐటీ హైదరాబాద్ లో శిక్షణ అందించాలని చూస్తున్నాం.


## రేవంత్.. ఏమయ్యాయి మీ ఎన్నికల ముందు నాటి ముచ్చట్లు?

◆ హామీల అమలుపై చేతులెత్తేయడంపై ఎక్స్ వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

**హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. తెలంగాణ అక్షయపాత్ర అని, ఏలే రాజు తెలివి ఉన్నవాడు అయితే కాంగ్రెస్ ప్రకటించిన హామీలన్నింటికీ, సరిపోయే సంపద తెలంగాణ సృష్టించగలదని నమ్మబలికి, ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకున్న రేవంత్ రెడ్డి.. ఈ రోజు ఏ హామీని పూర్తిగా అమలు చేయలేని స్థితికి వచ్చేసరికి, ప్రజా సంక్షేమానికి పైసలు లేవని చేతులెత్తేస్తున్నాడు! రాష్ట్ర ఖజానాలో నిధులు ఉన్నాయనుకొని ఈ 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చామని, ఇప్పుడు రాష్ట్ర ఖజానా లో నిధులు లేవని తెలిసేసరికి, తానే మోసపోయానని కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి.

# కేరళలో మరోమారు నిఫా వైరస్ విజృంభణ!

◆ హై రిస్క్‌లో ఐదు జిల్లాలు



**తిరువనంతపురం:** కేరళలో నిపా వైరస్ ముప్పు మరోసారి పొంచి ఉంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. కోజికోడ్, మలప్పురం, కన్నూర్, వయనాడ్, ఎర్నాకుళం జిల్లాలను జూనోటిక్ ఇన్ఫెక్షన్లకు హాట్‌స్పాట్‌లుగా ఆరోగ్య శాఖ గుర్తించింది. రాష్ట్రంలోని 5 జిల్లాల్లో ప్రభుత్వం ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ వైరస్ వినాశనం 2018 సంవత్సరంలో కనిపించింది. తరువాత 2019, 2021, 2023, 2024, ఇప్పుడు 2025 లోనూ కేసులు వెలుగులోకి వచ్చాయి. అటువంటి పరిస్థితిలో ఈ వైరస్ ఎంత ప్రమాదకర మైనదో, దాని లక్షణాలు ఏమిటో తప్పనిసరిగా తెలుసు కోవాల్సిందే..

### నిపా వైరస్ అంటే ఏమిటి?

ఇది జూనోటిక్ వైరస్. జూనోటిక్ వైరస్‌లు జంతువుల నుండి మానవులకు వ్యాపించే వైరస్‌లు. నిపా వైరస్ ప్రధానంగా గబ్బిలాలు, పందుల ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. కానీ ఒకసారి ఒక వ్యక్తి దీని బారిన పడితే, అది వ్యక్తి నుండి వ్యక్తికి సంపర్కం ద్వారా వేగంగా వ్యాపిస్తుంది. 1998లో మలేషియాలో తొలిసారిగా నిపా వైరస్ కేసు నమోదైంది. ఇది పందుల నుండి మనుషులకు వ్యాపించిందని నిర్ధారించబడింది. భారతదేశంలో 2001, 2018లో నిపా కేసులు పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. నిపా వైరస్ ఇన్ఫెక్షన్ మొదట్లో సాధారణ జ్వరంలా అనిపించవచ్చు. అయితే, దీనికి సరైన చికిత్స చేయకపోతే అది తీవ్రమైన రూపాన్ని తీసుకుంటుంది. నిపా వైరస్ ప్రారంభ లక్షణాలు అధిక జ్వరం, తలనొప్పి కావచ్చు. ఊపిరితిత్తులపై నిపా ప్రభావం కారణంగా రోగికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు.

నిపా వైరస్ సోకిన వ్యక్తి గందరగోళం, భ్రమలు, అపస్మారక స్థితి వంటి సమస్యలను కూడా ఎదుర్కొంటాడు. నిపా వైరస్ తీవ్రమైన లక్షణాలలో మూర్ఛ, కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.

### నిపా వైరస్ నివారణ చిట్కాలు

నిపా వైరస్ నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి మీ చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిపా వైరస్ సోకిన వ్యక్తి నుండి తగినంత దూరం పాటించడం ముఖ్యం. నిపా వైరస్ వ్యాప్తికి కారణమైన జంతువుల నుండి దూరం పాటించడం కూడా ముఖ్యం. నిపా వైరస్ సంక్రమణ లక్షణాలను మీరు గమనించినట్లయితే, ఆలస్యం చేయకుండా వెంటనే మీ వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

06

జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025

## మానవజాతి మనుగడకు ప్రాణం పోసింది మగువ!

◆ మంత్రి కందుల దుర్గేష్



అమరావతి, మహానాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళామణులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీట వేస్తోందని జర్మనీ పర్యటనలో ఉన్న మంత్రి దుర్గేష్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళామూర్తులకు పురుషులందరూ దన్నుగా నిలవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. మాతృత్వం, వీరత్వం, దాతృత్వం వంటి నవరసాలను పోషించగలిగే ఏకైక ప్రాణి ఈ ప్రపంచంలో కేవలం స్త్రీ మాత్రమే అని కీర్తించారు. మానవజాతి మనుగడకు ప్రాణం పోసింది మగువ.. త్యాగంలో, అనురాగంలో తరగని పెన్నిధి మగువ అంటూ అభివర్ణించారు.

స్వాతంత్రోద్యమ సమయంలో మొట్టమొదటగా కత్తిపట్టిన వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి దగ్గర్నుంచి నేటి చెడు మీద పోరాటం చేస్తున్న ప్రస్తుత ప్రజా ప్రతినిధుల వరకు ఎందరో మహిళామణులు విస్తృతంగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మహిళా హక్కులు హరించారని, మహిళాశక్తి సన్నగిల్లిపోయిందని విమర్శించారు. ప్రపంచంలోని ప్రతి విజయవంతమైన సమాజం వెనుక బలమైన సాధికారత కలిగిన మహిళ ఉంటుందన్నారు. తల్లిగా, సోదరిగా, భార్యగా, కూతురుగా జీవితంలోని ప్రతి దశలో మగవాడిని నడిపించేది మహిళ అని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. స్త్రీని గౌరవిద్దాం .. ఆమెకు సంరక్షణగా ఉందామని సమాజానికి మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

## సమగ్ర కుటుంబ సర్వేపై సామాజికవేత్తలతో స్వతంత్ర హెూదాతో కమిటీ

◆ సలహా కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్: సమగ్ర కుటుంబ(ఆర్థిక , రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హెూదాతో కమిటీ ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సమగ్ర సర్వే సమాచారాన్ని విశ్లేషణ చేసి చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు.

శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మన్ గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్ గా వ్యవహరిస్తారు అని తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్య భంగ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు.

ఈ నిపుణుల కమిటీ సర్వే నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని తెలిపారు. ఈ సామాజిక ఆర్థిక సర్వేను దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నత భావంతో మార్గదర్శనం చేశారని తెలిపారు. సమాజంలో సామాజిక న్యాయానికి పునాది వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సర్వే జరిపించింది అన్నారు.

ఈ గొప్ప కార్యక్రమంలో చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వరాదనే ఆలోచనతో లోతుగా అధ్యయనం చేసి భాగస్వాములు అందరితోనూ సర్వేపై ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సర్వే జరిపించినట్లు తెలిపారు.

ఎటువంటి పొరపాట్లు జరగకుండా, అపోహలకు తావు లేకుండా ఉండటం కోసం దేశంలో, రాష్ట్రంలో సామాజిక స్పృహ కలిగిన మేధావులను సమగ్ర కుటుంబ సర్వే అధ్యయనంలో భాగస్వాములను చేసి స్వతంత్ర హెూదా కల్పించినట్టు తెలిపారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.


## మహిళా సాధికారతతోనే సమాజ అభ్యున్నతి

◆ ముఖ్య అతిథి డిజిపి హరీష్ కుమార్ గుప్తా సతీమణి సీమా గుప్తా

◆ డీజీపీ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




మంగళగిరి, మహానాడు: రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సతీమణి శ్రీమతి సీమా గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాశస్త్యాన్ని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని, మహిళా సాధికారతతోనే సమాజం అభ్యున్నతి సాధించి, ప్రగతిపథంలో పయనిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు గౌరవ ముఖ్య అతిథి చేతులు మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజిపి రాజకుమారి, డిఐజి కమ్యూనికేషన్స్ ఎస్ఎస్‌జే లక్ష్మి, డిసిపి సరిత, డీజీపీ కార్యాలయంలోని ఉన్నతాధికారులు, డీజీపీ రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

07

www.mahanaadu.com

|| ||





జనసేనలో చేరిన పిఠాపురం
వైసీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీ పెండెం దొరబాబు



గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం పరిధిలోని ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం అందజేశారు.

## రాష్ట్ర అప్పులపై కూటమి నేతల అబద్ధపు ప్రచారం!

- వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి



**తాడేపల్లి, మహానాడు:** రాష్ట్ర అప్పులపై కూటమి పార్టీల నేతలు చేస్తున్న ప్రచారమంతా పచ్చి అబద్ధమని శాసనసభ సాక్షిగా తేలిపోయిందని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న అప్పులు రూ.5,63,376 మాత్రమేనని ఆర్థికమంత్రి శాసన సభలో లిఖిత సమాధానం ద్వారా అంగీకరించారని తెలిపారు. అందుకే ఇప్పటి వరకు వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంపై విపరీతంగా దుష్ప్రచారం చేసిన కూటమి నేతలు తమ అబద్దాలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి, మరో శ్రీలంక అయిందంటూ కూటమి నేతలు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌తో పాటు, పురందేశ్వరీ కూడా దుష్ప్రచారం చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించారు. అసత్యాలతో అధికారంలోకి వచ్చిన తరువాత తాజాగా గవర్నర్ తోనూ అప్పులపై సమగ్ర సమాచారం లేకుండానే బడ్జెట్ ప్రసంగం చేయించారు. ఓట్ల కోసం కూటమి పార్టీలు వైయస్సార్సీపీ ప్రభుత్వంపై నిందలు మోపారు. గత ప్రభుత్వం ఏకంగా రూ. 14 లక్షల కోట్ల అప్పులు చేసిందంటూ విష ప్రచారం చేశారు. మరి ఇప్పుడు దానికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు.

## రాయచోటి నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్



**విజయవాడ, మహానాడు:** అన్నమయ్య జిల్లా, రాయచోటిలో ఈ నెల నాలుగోతేదీన దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన శ్రీ వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం పై దాడి చేసిన మతోన్మాదులను తక్షణమే గుర్తించి, వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## క్షత్రియులకు అండా దండా!

- ఏపీ క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ కనకరాజుసూరి
- విజయవాడలో డైరెక్టర్లతో కలిసి పదవీ ప్రమాణస్వీకారం

**విజయవాడ, మహానాడు:** రాష్ట్రంలోని క్షత్రియులకు అన్ని విధాలుగా అండా దండగా ఉంటానని ఆంధ్రప్రదేశ్ క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణరాజు(కనకరాజు సూరి) అన్నారు. విజయవాడలో శుక్రవారం డైరెక్టర్లతోపాటు ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ ఎండీ మహేశ్వరరెడ్డి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కనకరాజుసూరి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. క్షత్రియుడు అంటే త్యాగానికి, సేవాగుణానికి, ధర్మానికి ప్రతీక అన్నారు. అటువంటి క్షత్రియుల్లో పేద వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు.


క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల వెంకట శ్రీనివాస్‌రాజు(సుభాష్) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని క్షత్రియుల పురోగతికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సమాజ క్షేమం నిత్యం సేవాభావంతో మెలిగే క్షత్రియులకు అండదండగా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. క్షత్రియులను అందర్నీ ఒకే తాటిపైకి తెచ్చి ప్రగతిబాటలో మరింత ముందుకు సాగేలా చేస్తామని సుభాష్ అన్నారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ వేగేశ్న కనకరాజుసూరితోపాటు డైరెక్టర్లుగా పేరిచర్ల సుభాష్(నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం), అద్దేపల్లి ప్రతాప్‌రాజు(రాజంపేట), భూపతిరాజు శ్రీకృష్ణవర్మ(ఉండి), చేకూరి వెంకటరామరాజు(నిడదవోలు), జయప్రకాష్ నారాయణరాజు దంతులూరి(విజయవాడ సెంట్రల్), మంతెన సత్యనారాయణరాజు(రాజమండ్రి సిటీ), పొత్తూరి కృష్ణంరాజు(ఉంగుటూరు), రామకృష్ణంరాజు యండుకూరి(ఉంగుటూరు), రామచంద్రరాజు నంబూరి(చింతలపూడి), సత్యనారాయణరాజు దెందుకూరి(అమలాపురం), వెంకట సత్యనారాయణరాజు(గన్నవరం), యరకరాజు సత్యహరిహరరాజు(భీమవరం)లు పదవీ ప్రమాణస్వీకారం చేశారు.

## వాచ్‌మెన్ రంగన్న మృతిపై అనుమానాలు

- సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, మహానాడు:** వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్ మెన్ రంగన్న మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రంగన్న మృతి అనుమానాస్పదంగా ఉందని అన్నారు. శుక్రవారం కేబినెట్ భేటీ అనంతరం, రంగన్న మృతిపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. గతంలో పరిటాల హత్య కేసులోనూ సాక్షులు ఇలాగే మరణిస్తూ వచ్చారన్న చంద్రబాబు వ్యాఖ్యానించారు. రంగన్న ఊపిరితిత్తుల వ్యాధితో మరణించారని ఆయన భార్య చెబుతున్నప్పటికీ, పలు వైపుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా రంగన్న మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ... గతంలో పరిటాల రవి హత్య కేసులోనూ సాక్షులు ఇదే విధంగా మరణిస్తూ వచ్చారని... ఇప్పుడు వివేకా హత్య కేసులో అలాంటి పరిణామాలే కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.



వివేకా హత్య జరిగినప్పుడు జగన్, వైఎస్ భారతిలను కారులో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మరణించాడన్నారు. వివేకా హత్య గురించి కారులో జగన్, భారతి మాట్లాడుకున్న మాటలను ఆ డ్రైవర్ విన్నాడని, ఆ తర్వాత అనుమానాస్పదంగా మృతి చెందాడంటూ గతంలో జరిగిన ప్రచారంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. వివేకా వ్యవహారానికి సంబంధించి ఇప్పటిదాకా ఏడుగురు మరణించారని కూడా చర్చ జరిగింది.

దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... జగన్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాను అనేకసార్లు చెబుతున్నానని గుర్తుచేశారు. కాగా, వాచ్ మెన్ రంగన్న మృతి వెనుక పోలీసుల హస్తం ఉందంటూ వచ్చిన వార్తలపై డీజీపీ స్పందించారు. డీజీపీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రంగన్న మృతిలో అనుమానాలు ఉన్న మాట నిజమేనని, పోలీసుల విచారణలోనూ ఆ విషయం స్పష్టమైందని అన్నారు.



## జోగులాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళికా

- తక్షణ పనుల కోసం కమిటీ ఏర్పాటు
- ఎండోమెంట్స్ శాఖ సమీక్షా
- పాల్గొన్న చిన్నారెడ్డి, శైలజ రామయ్యర్, శ్రీధర్, తదితరులు

**హైదరాబాద్,మహానాడు:**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకు సాగాలని, తక్షణ పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎండోమెంట్స్ శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

శుక్రవారం ప్రజా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, ఎండోమెంట్స్ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆలయ కమిటీ ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్ యాదవ్, ఆగమా శాస్త్ర పండితులు గోవింద హరి, తదితరులు పాల్గొన్నారు. జోగులాంబ ఆలయ సమగ్ర అభివృద్ధికి తాత్కాలిక పనులు, దీర్ఘ కాలిక పనుల జాబితాను సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈనెల 20 వ తేదీ నాటికి తాత్కాలిక, తక్షణ పనులను ఎంపిక చేసి నివేదిక అందజేయాలని కమిటీకి కాల పరిమితిని నిర్ణయించారు. తాత్కాలిక పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో లైటింగ్, పార్కింగ్, ఆలయ చరిత్రతో ప్రచార బోర్డులు పెట్టాల ని, అందుకు బస్సు స్టాండ్స్, రైల్వే స్టేషన్స్, ముఖ్య ప్రదేశాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు. దీర్ఘ కాలిక పనులలో బోటింగ్, టూరిజం అభివృద్ధి, అతిథి గృహాల నిర్మాణాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, ఆర్చిల ఏర్పాటు వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా చిన్నారెడ్డి పలు సూచనలు చేశారు. అత్యంత ప్రాధాన్యతతో పనులు చేపట్టాలని, లక్ష్యం మేరకు ముందుకు సాగాలని చిన్నారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో సూర్యనారా యణ మూర్తి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఎండోమెంట్స్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆలయ అదుకారులు పాల్గొన్నారు.

## క్యాబినెట్లో సీఎం ఎదుటే మంత్రుల పంచాయితీ

- బిజెపి శాసనసభాక్ష నేత మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:**

నిన్న కేబినెట్ సమావేశంలో ఒక మంత్రికి ముఖ్యమంత్రికి గొడవ జరిగింది. అలాగే ఒక సీనియర్ మంత్రికి ఇంకో మంత్రికి కూడా వాగ్వాదం జరిగింది. వీళ్లకి ఇరిగేషన్ ప్రాజెక్ట్ కి సంబంధించి ఫండ్స్ అలోకేషన్ విషయంలో గొడవ జరిగింది. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వేగంగా పూర్తి చేయాలని రూ.1000 కోట్ల అలోకేట్ చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదిస్తే దానికి ముఖ్యమంత్రినే వ్యతిరేకించారు

ఎన్నో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు ఉన్నాయని.. అన్ని కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు తీసుకుపోతే ఎలా అని సీఎం రేవంత్ రెడ్డికి ఇరిగేషన్ మంత్రికి వాగ్వాదం జరిగింది

ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి గత కేబినెట్ మీటింగ్లో ఉదండపూర్



రిజర్వాయర్ ఎస్టిమేషన్ ను రూ.430 కోట్ల నుండి రూ.1150 కోట్లకి రివైజ్డ్ ఎస్టిమేషన్ వేయించుకున్నాడు

పొంగులేటికి రివైజ్డ్ ఎస్టిమేషన్ ఇచ్చారు.. మరి మాకు సంబంధించిన కాంట్రాక్టర్లు ఉన్నారు కదా వాళ్లకు ఎందుకు ఇవ్వరని మంత్రుల మధ్య పంచాయితీ మొదలైంది.

## ఉమ్మడి పాలన నాటి నీటి గోస దృశ్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల మళ్ళీ చూస్తున్నాం...

- మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్,మహానాడు:**

అదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం చింతకర్ర గ్రామ గిరిజనులు తాగు నీటి కోసం పడుతున్న కష్టం ఇది. ఉమ్మడి పాలన నాటి నీటి గోస దృశ్యాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల మళ్ళీ చూస్తున్నాం.


మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వేసవి వేళ మారుమూల ప్రజలకు శాపంగా మారింది. భుజాలు కాయలు కాసేలా బిందెలు మోస్తూ, వాగులు, వ్యవసాయ బావుల నుండి నీళ్ళు తెచ్చుకునే దుస్థితిని కల్పించింది. పథకాలు అమలులో వైఫల్యం. పరిపాలనలో వైఫల్యం చివరకు కెసిఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ



ద్వారా నీళ్ళు సరఫరా చేయడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం.

## సీఎం గారు.... ఇదేం పాలన?

- పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంది?
- ఉద్యోగులకు డీఏలివ్వరు....ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా?
- డ్రైవర్లు, వర్క్ ఇన్ స్పెక్టర్లకు 25 శాతానికిపైగా వేతనాలు తగ్గించడం దుర్మార్గం?
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్య
- నాలుగేళ్లుగా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎందుకు పెంచడం లేదు?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా తీరు మారదా?
- తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచండి



**హైదరాబాద్,మహానాడు:**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గం. పట్టణాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకం. కరోనా మహమ్మారి కాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి అందించిన సేవలు మరువలేనివి. దురదృష్ట మేమిటంటే... ఆనాటి నుండి నేటి వరకు వేతనాలు పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

పైగా మున్సిపల్ డ్రైవర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గం. భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. ప్రతి ఏటా పెరిగే నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల జీత భత్యాలను పెంచడం పరిపాటి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు పెంచకపోగా ఉన్న వేతనాల్లో భారీగా కోత విధించడం ఎంత వరకు సమంజసం?

ఇప్పటి వరకు శానిటరీ ఇన్ స్పెక్టర్లకు నెల వేతనం రూ.22 వేలు చెల్లిస్తుండగా, ఆ వేతనాన్ని రూ.16,600లకు తగ్గించడం దుర్మార్గం. అట్లాగే డ్రైవర్లకు సైతం ఇదే విధంగా కోత విధించడం ఎంత వరకు న్యాయం?

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 30 వేల 955 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. 2021 జూన్ 11న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ 30 శాతం మేరకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. నాటి నుండి నేటి వరకు అంటే గత నాలుగేళ్లుగా వేతనాల పెంపు ఊసే లేదు. పైగా దాదాపు 3 వేల మంది శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో ఏకంగా 25 శాతానికిపైగా కోత విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్యగా భావిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసం?

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటిని చెల్లించడం లేదు. జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును కూడా డ్రా చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆఖరికి రిటైర్డ్‌మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా కాళ్ల చెప్పులరిగేలా ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ ఉద్యోగులను వేధిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినా తీరు మారకపోవడం బాధాకరం. నేడు మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో భారీగా కోత విధించడాన్ని చూస్తుంటే ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిపట్ల కాంగ్రెస్ కు ఉన్న వ్యతిరేక భావం అర్థమవుతోంది. తెలంగాణ ప్రజలు విజులు. అన్నీ గమనిస్తున్నారు. తక్షణమే చేసిన పొరపాటును సరిదిద్దుకుని మున్సిపల్ డ్రైవర్లు, శానిటేషన్ వర్క్ ఇన్ స్పెక్టర్ల వేతనాలను సరిచేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది అందరికీ వేతనాలను పెంచాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.



ట్రైన్‌లో ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, ఎంఎల్‌సి సీట్ కోసం కాదు... ఇష్టం ఉన్నట్టు వార్తలు రాయొద్దు అని మీడియాకి సూచించిన జగ్గారెడ్డి




ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈరోజు అసెంబ్లీ లాబీలో సహచర మంత్రులు , మహిళా ఎమ్మెల్యేలతో కలిసి గౌరవ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్. సవిత

## మార్చి 10న గ్రూప్-1 ఫలితాలు

**హైదరాబాద్,మహానాడు:**

తెలంగాణలో గ్రూప్స్ ఫలితాల వెల్లడికి రూపొందించిన షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) ప్రకటించింది. మార్చి 10న గ్రూప్–1 ఫలితాలు వెల్లడించనున్నట్లు కమిషన్ తెలిపింది. ఈ నెల 10 నుంచి 18 మధ్య గ్రూప్–1, 2, 3 ఫలితాలను





వెల్లడించనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది.

రాష్ట్రంలో 563 గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి టీజీపీఎస్సీ తుది పరిశీలన కొనసాగిస్తోంది. ఈనెల 10న ఫలితాల విడుదల అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. గ్రూప్–1 ప్రధాన పరీక్షలకు 21,093 మంది హాజరయ్యారు. దీని ప్రకారం ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీపడుతున్నారు.

## ఫోర్త్ సిటీని అభివృద్ధి పాలకుల లక్ష్యం!

**హైదరాబాద్,మహానాడు:**

ఇదే ఫ్యూచర్ సిటీ భౌగోళిక స్వరూపం! మొత్తం 765.28 చ.కి.మీ విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది పాలకుల లక్ష్యం! మహేశ్వరం, ఆమనగల్, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాలు ఫ్యూచర్ సిటీ పరిధిలోకి రానున్నాయి! ఈ 7 మండలాల్లోని 56 గ్రామాలతో ఎఫ్సీడీఏ ఏర్పాటు కానుంది! ఆమనగల్లులో 2 గ్రామాలు, మహేశ్వరం నుంచి 2 గ్రామాలు, మంచాల నుంచి 3 గ్రామాలు, ఇబ్రహీంపట్నంలో 8 గ్రామాలు, కడ్తాల్లోని 6 గ్రామాలు, యాచారం నుంచి 17 గ్రామాలు,




కందుకూరు నుంచి 18 గ్రామాలు క్యాబినెట్ ఆమోదంతో ఇకపై ఫ్యూచర్ సిటీ పరిధిలోకి రానున్నాయి! కాగా, ఎఫ్సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా, మిగిలిన వాటిని 56 ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తారు!



పోసానికి రెండు రోజుల కస్టడీకి నరసరావుపేట కోర్టు అనుమతించింది. పోసాని కృష్ణ మురళిని నేడు, రేపు పోలీసులు విచారించనున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను దూషించిన కేసులో పోసాని ఇప్పటికే రిమాండ్‌లో ఉన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

8

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025 ||


# నా పోటీ గుజరాత్‌తో కాదు.. న్యూయార్క్, టోక్యోతోనే పోటీ

**దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత గల ప్రధాని మోడీ కేవలం గుజరాత్కు మాత్రమే పనిచేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. గుజరాత్ రాష్ట్రం.. తెలంగాణ కంటే ఏ అంశంలో ఏ రంగంలో గొప్పదని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలను బిజెపి అణగదొక్కుతోందని, అందులో భాగంగానే నియోజకవర్గ పునర్విభజనకు తెర లేపిందని ఆరోపించారు. బ్రహ్మకు పాత్రికేయుడు రాజ్దీప్ సర్దేశాయ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా కుండ బద్దలు కొట్టారు. రేవంత్ రెడ్డి ఇంకా ఏమన్నారంటే...**

- అయినా గుజరాత్‌లో ఏముంది?
- దక్షిణాదిపై బిజెపి ప్రతీకారం
- బీసీలకు బిజెపి అన్యాయం
- హిందీ కోసం మోడీ అమిత్ షా ఎందుకు పట్టుపడుతున్నారు?
- అద్వానీ మురళి మనోహర్ జోషి పక్కన పెడితే మీడియా ప్రశ్నించదు
- ఇండియా టుడే కాంక్లేవ్... 2025 లో రాజ్దీప్ సర్దేశాయ్ తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**రాజ్ దీప్ సర్దేశాయ్:** భారత రాజకీయాల్లో ఎదుగుతున్న నేత రేవంత్ రెడ్డి... దేశంలో ఉన్న ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లో చిన్న వయస్కుడు.. 55 ఏళ్లు... ఆయన పార్టీలో ఎదుగుతున్న నాయకునిగా ఎక్కువ మంది విశ్వసిస్తున్నారు..? ఆయనకు స్వాగతం..

మిస్టర్ రేవంత్ నన్ను ఒక బీజేపీ నేత అడగమన్నారు..? మేం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వచించిన గుజరాత్ మోడల్‌ను దేశం ముందుచాం.. కాంగ్రెస్‌కు అటువంటి మోడల్ ఏమైనా ఉందా..? కాంగ్రెస్‌కు అటువంటి రాష్ట్రం మోడల్ ఏమైనా ఉందా దేశం ముందు ఉంచేందుకు..? బీజేపీకి గుజరాత్ మోడల్ ఉన్నట్లు మీకు తెలంగాణ మోడల్ ఉందా..?

**రేవంత్ రెడ్డి:** గుజరాత్ నమూనా కాలం చెల్లిన నమూనా (గుజరాత్ మోడల్ ఇజ్ అవుట్ డేటెడ్ మోడల్) అది టెస్ట్ మ్యాచ్ మోడల్... తెలంగాణది 20-20 నమూనా (మోడల్). తెలంగాణ నమూనానే దేశానికి నమూనా. గుజరాత్ నమూనాలో ఏవిధమైన సంక్షేమం లేదు. ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అది మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రయత్నించిందే.. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత గుజరాత్ మార్కెటింగ్‌కు ఎవరైనా అంబాసిడర్ ఉన్నారా? లేరా? మోదీనే సొంతంగా గుజరాత్ కోసం పోరాడుతున్నారు... మోదీ ఈ దేశానికి ప్రధానమంత్రి.. ప్రధానమంత్రి దేశంలో ఏమూలకైనా పెట్టుబడులు వస్తే వాటికి ఆయన మద్దతు ఇవ్వడం లేదు. ఎవరైనా దేశానికి పెట్టుబడులు పెట్టడానికి వస్తే గుజరాత్‌కు వెళ్లి పెట్టుబడులు పెట్టమని చెబుతున్నారు... ఇదేం పద్ధతి..?

**రాజ్ దీప్ సర్దేశాయ్:** గుజరాత్ నమూనాకు మీ తెలంగాణ నమూనాకు మధ్య తేడా ఏమిటి?

**రేవంత్ రెడ్డి:** నాది అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన నమూనా... ఈ మూడు మా ప్రాధాన్యాంశాలు.. అహ్మదాబాద్.. హైదరాబాద్ లోని మౌలిక వసతులను పోల్చి చూడండి.. మా హైదరాబాద్‌లో ఉన్న వసతులు.. అహ్మదాబాద్‌లో ఉన్న వసతులు చూడండి. హైదరాబాద్‌తో పోటీ పడే ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం అహ్మదాబాద్‌కు ఉన్నాయా? గుజరాత్‌లో ఫార్మా, ఐటీ పెట్టుబడులు ఉన్నాయా..? గుజరాత్‌లో ఏం ఉంది? నేను అహ్మదాబాద్, ముంబయి, బెంగళూర్, ఢిల్లీతో పోటీ పడడం లేదు.. నేను న్యూయార్క్, సియోల్, టోక్యో తో పోటీపడాలనుకుంటున్నాం. మా తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీ పడలేరు.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** భవిష్యత్ అవసరాలకు తగిన నగరాల నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణలో అహ్మదాబాద్‌తో పోల్చుకుంటే హైదరాబాద్... గుజరాత్‌తో పోల్చుకుంటే తెలంగాణ ముందున్నాయని మీరు బహిరంగ సవాల్ విసురుతున్నారా?



**రేవంత్ రెడ్డి:** అవును.. వంద శాతం.. అందుకే మేం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన నగరం నిర్మించే పని ప్రారంభించాం.. అయిదేళ్ల తర్వాత వచ్చి చూడండి ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మించబోతున్నాం. గుజరాత్, అహ్మదాబాద్‌లో అటువంటి నగరం ఎక్కడైనా ఉందా..? కోవిడ్ సమయంలో ఔషధాలు ఎక్కడ తయారయ్యాయి. మూడో వంతు ఔషధాలు మేం సరఫరా చేశాం. భారతదేశంలోని 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయి. ఐటీ గురించి మేం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్‌లో ఐటీ ఏం ఉంది.. అహ్మదాబాద్ ఐటీ, హైదరాబాద్ ఐటీ ఎగుమతులు చూడండి.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీరు చెప్పే హైదరాబాద్, తెలంగాణ నమూనా 2023లో ప్రారంభమైందా..? 2014లోనే దేశం ప్రయాణం ప్రారంభమైందని మోదీ చెప్పినట్లుగానే మీరు 2023లో తెలంగాణ నమూనా ప్రారంభమైందని క్లెయిమ్ చేసుకోకూడదుగా..? చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ లు కొంత ఖ్యాతికి అర్హులు కదా? మీరు దానిని ముందుకు తీసుకుపోతున్నారు.. ప్రతి రాజకీయ నాయకుడు తమతో మొదలవుతుందని భావిస్తున్నారు..?

**రేవంత్ రెడ్డి:** మీరు సగం నిజమే చెప్పారు. నేను పూర్తి వాస్తవం చెబుతా.. ఇది ఇప్పుడు ప్రారంభమైంది కాదు.. కులీ కుతుబ్ షాహీ నుంచి ప్రారంభమైంది. కులీ కుతుబ్ షా తర్వాత నిజాం సర్కార్, తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తర్వాత మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి.. అలా ఆ తర్వాత ఇప్పుడు నేను ఉన్నా... 450 ఏళ్లకుపైగా చరిత్ర తెలంగాణ, హైదరాబాద్‌కు ఉంది. చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు కట్టారా?

సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు కట్టారా..? హైదరాబాద్‌లో ప్రముఖ కట్టడాలన్నీ 450 ఏళ్ల నుంచే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు మారినా ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కొనసాగింది. మీరు హైదరాబాద్ రండి.. ప్రపంచంలోనే అత్యుత్తమైన గాజులు, ముత్యాలు చార్మినార్ వద్ద దొరుకుతాయి. ఇప్పుడు డాలర్ల మార్పిడి చేస్తున్నాం...400 ఏళ్ల క్రితమే అక్కడ నగదు మార్పిడి ఉంది... ప్రపంచంలోని ఎక్కడ నగదు (నోట్) తీసుకువచ్చినా అక్కడ మార్చుకోవచ్చు...

**ప్రీతి:** మీరు ప్రధానమంత్రి మోదీ, గుజరాత్‌పై దాడి ప్రారంభించారు.. ప్రధానమంత్రి వికసిత్ భారత్ గురించి మాట్లాడుతుంటే మీరు తెలంగాణ మోడల్ గురించి చెబుతున్నారు. తెలంగాణ వన్ ట్రిలియన్ ఎకానమీ అంటున్నారు.. ఆయనది అబద్ధం (జుమ్లా) మీది విజన్ అంటున్నారు...ఎలా..?

**రేవంత్ రెడ్డి:** నేను ఎవరిది అబద్ధం (జుమ్లా) అనడం లేదు. నేను ఒక్కటే సూటిగా చెప్పాలనుకుంటున్నా.. ఎవరిపై పక్షపాతం చూపొద్దు అంటున్నా... మోదీ గిఫ్ట్ సిటీ తీసుకెళ్లారు. ఎవరైనా విదేశీయుడు గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెడితే లాభాలు వాళ్ల దేశానికి తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు. భారతదేశంలో ఇతర రాష్ట్రాలకు ఎందుకు ఆ అవకాశం ఇవ్వలేదు.

మోదీ ఈ దేశానికి ప్రధానమంత్రి.. అలాంటప్పుడు గిఫ్ట్ సిటీకి ఎందుకు ప్రత్యేక రాయితీలు ఇచ్చారు. నేను ఈ మీడియా ద్వారా మోదీ, బీజేపీని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్న....మీరు గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెట్టేవారికి ఎన్నో ప్రత్యేక అవకాశాలు, రాయితీలు ఇచ్చారు.. నిబంధనలు అతిక్రమించి గిఫ్ట్ సిటీలో ప్రయోజనాలు కల్పిస్తున్నారు.. హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వరు. గిఫ్ట్ సిటీలో యూనివర్సిటీ, పరిశ్రమ ఏ పెట్టుబడి వచ్చినా లాభాలు ఆయా దేశాలకు తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు.. హైదరాబాద్‌కు ఆ అవకాశం ఎందుకు ఇవ్వరు?

**ప్రీతి:** మోదీతో మంచి సంబంధాలున్న మీరు ఒక్కసారిగా ఆయనతో యుద్ధం ప్రారంభించారు ఎందుకు?

**రేవంత్ రెడ్డి:** మోదీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవు.. నేను మోదీ విధానాలతో విభేదిస్తున్నా. మోదీ దేశానికి ప్రధానమంత్రి ఆయనకు గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి మా రాష్ట్రానికి కావల్సినవి అడగడం నా హక్కు, బాధ్యత. ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రి చేశారు.

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** హైదరాబాద్ భవిష్యత్ నగరంగా నిర్మిస్తామని అంటున్నారు... ఏ భవిష్యత్ నగరానికైనా పెట్టుబడులు అవసరం. మీ బడ్జెట్‌న చూస్తే రూ.3.50 లక్షల కోట్ల అప్పు ఉంది. మీరు అనేక హామీలు ఇచ్చారు. నిరుద్యోగులకు రూ.4 వేలు, రైతులు, కూలీలకు హామీలు ఇచ్చారు. మీ దగ్గర నిధులు లేనప్పుడు అవన్నీ నెరవేర్చడం సవాల్ అని మీరు అనుకోవడం లేదా..?

**రేవంత్ రెడ్డి:** కేసీఆర్ సృష్టించిన భావనలో మీరు, మా ప్రజలు ఉన్నారు. తెలంగాణ అప్పులు రూ. 3.50 లక్షల కోట్లు కాదు. రూ.7 లక్షల కోట్లు. 2014లో మేం తెలంగాణ ఏర్పాటు చేసినప్పుడు రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.69 వేల కోట్లు. కేసీఆర్ పదేళ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు. మా రాష్ట్రానికి ఇప్పుడు నెలకు ఉన్న ఆదాయం రూ.18,500 కోట్లు... జీతాలు,పింఛన్లకు నెలకు రూ.6,500 కోట్లు, ఈ అప్పులకు వడ్డీలకు రూ.6,500 కోట్లు నెలకు మేం కట్టాలి. మేం తిన్నా తినకపోయినా.. టీ తాగినా, తాగకపోయినా ప్రతి నెల పదో తేదీ లోపు రూ.13 వేల కోట్లు చొప్పున కట్టాలి. మిగిలిన రూ.5 వేల కోట్లు, రూ.5,500 కోట్లతో మేం అభివృద్ధి, సంక్షేమం చేపట్టాలి.

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** మరి మీరు గ్యారంటీలు అన్ని ఎలా చేయగలరు..?

**రేవంత్ రెడ్డి:** సరైన ప్రశ్న రాజ్‌దీప్.. మీలాగే నేను కూడా రాష్ట్రానికి రూ.3.75 లక్షల కోట్ల అప్పు ఉందనుకున్నా. వచ్చే ఆదాయంతో అన్నీ చేయగలమనుకున్నా. కుర్చీలో కూర్చున్న తర్వాత అసలు విషయం బయటపడింది.

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్యారంటీలు చేయలేమని మీరు చెబుతున్నారా..?

**రేవంత్ రెడ్డి:** నేను గ్యారంటీల గురించి చెప్పడం లేదు.. నేను అప్పులకు తిరిగి చెల్లించే గ్యారంటీల గురించి చెబుతున్నా...నేను గ్యారంటీలు చేయమని చెప్పడం లేదు. మా పరుగు సాగుతోంది.. మా పరుగును సాగనివ్వండి...వేగం ఉత్తేజాన్నిస్తుంది.. కానీ చంపేస్తుంది తెలుసుగా.. (స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్) (అంతా నవ్వులు). మోదీ ఢిల్లీలో అనేక గ్యారంటీలు ఇచ్చారు.. ఎవరూ మోడీని ప్రశ్నించడం లేదు మోదీ గ్యారంటీలకు వ్యతిరేకమైతే ఢిల్లీలో ఎందుకు గ్యారంటీలు ఇచ్చారు. మేం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణాలను మూడు నెలల్లోపు మాఫీ చేశాం. భారతదేశంలో తొలిసారి నేను ఇంత రుణమాఫీ చేశా. ఇప్పటి వరకు ఎవరూ చేయలేదు...

**ప్రీతి:** కానీ ఈ గ్యారంటీలు సరైనవి కాదుగా?

**రేవంత్ రెడ్డి:** ఇది ఒక వ్యక్తిని అడగకూడదు...దీనిపై చర్చ





జరగాలి...నేను అబద్ధం చెప్పడం లేదు. వీటిపై అంతా మాట్లాడాలి. గదిలో ఒకటి మాట్లాడుతున్నారు.. బయట మరొకటి మాట్లాడుతున్నారు.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** దీనిపై దేశవ్యాప్త చర్చ జరగాలి అంటున్నారా?

**రేవంత్ రెడ్డి:** ఒకే దేశం – ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై కాకుండా వీటిపై చర్చ జరగాలి. మూల ధన వ్యయంపై (క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్) చర్చ జరగాలి. నేను నెలకు రూ.500 కోట్లు కూడా క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్‌పై పెట్టలేకపోతున్నా. రానున్న రోజుల్లో రాష్ట్రం, దేశం ఏం కావాలి..

**రాజ్ దీప్ సర్దేశాయ్:** నియోజకవర్గాల పునర్విభజన టిక్కింగ్ టైంబాంబ్ అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అంటున్నారు...? మీరు ఆయనతో ఏకీభవిస్తున్నారా...

**రేవంత్ రెడ్డి:** మొట్ట మొదట నేనే ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఈ అంశాన్ని లేవనెత్తా. ఏం చేసినా బీజేపీకి దక్షిణాదిలో ఏం రావడం లేదు. దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకు నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని బీజేపీ ఎంచుకుంది. దక్షిణాది ప్రాతినిధ్యాన్నితగ్గించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఇందులో ప్రతీకారం ఏముంది.. చట్ట ప్రకారం 2026 జనాభా లెక్కల అనంతరం సీట్ల సంఖ్య ఉంటుంది.. ఎక్కడ ప్రతీకారం ఉంది. ఎందుకు మీరు దీనిని దక్షిణాది.. ఉత్తరాది పోరుగా చూస్తున్నారు?

**రేవంత్ రెడ్డి:** మంచి ప్రశ్న అడిగారు. కుటుంబ నియంత్రణ చేపట్టాలని ఎవరు ఆదేశించారు. కుటుంబ నియంత్రణ వచ్చాకే మేం ఇద్దరం.. మాకు ఇద్దరం.. మేం ఇద్దరం.. మాకు ఒక్కరు నినాదాలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే దక్షిణాది అమలు చేసింది. ప్రభుత్వం చెప్పింది చేస్తే మాపై ప్రతీకారం తీర్చుకుంటారా.? కుటుంబ నియంత్రణ విధానానికి ముందైన 1971 లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టండి.

**రాజ్‌దీప్ సర్దేశాయ్:** ఎం.కె.స్టాలిన్ ఎక్కువ మంది పిల్లలను కనమంటున్నారు.. దానిని సమర్థిస్తున్నారా..?

**రేవంత్ రెడ్డి:** అది వేరే అంశం..దానికి సమయం ఉంది...30 ఏళ్ల తర్వాత చేపట్టమనండి... అప్పుడు దక్షిణాది సత్తా ఆధారంగా సంఖ్య పెరుగుతుంది.. (నవ్వులు).. అప్పుడు మా నియోజకవర్గాలు పెరుగతాయి.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** అంటే మీరు స్టాలిన్ ను సమర్థిస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత చేపట్టమంటున్నారు.

**రేవంత్ రెడ్డి:** ఈ దేశంలో ప్రతి రాష్ట్రానికి కొన్ని హక్కులున్నాయి.. ఇది రాష్ట్రాల సమాఖ్య.. దక్షిణాదిలో బీజేపీకి అధికారం లేదు.. ప్రాతినిధ్యం లేదు.. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని శిక్షించే పనులు చేయకూడదు.

**ప్రీతి:** దక్షిణాది పార్టీలు తమ హిస్టీరియాను చాటుకుంటున్నాయని అమిత్ షా అంటున్నారు?

**రేవంత్ రెడ్డి:** దక్షిణాది రాష్ట్రాలే కాదు పంజాబ్ నుంచి మనీష్ తివారి ఏం చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు నష్టమే. బీమారు (బిహార్, మధ్యప్రదేశ్,ఉత్తరప్రదేశ్, రాజస్థాన్) రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయని చెబుతున్నారు..

**ప్రీతి:** అమిత్ షా ప్రొరేటా ప్రకారం (సంభావ్యతా ఆధారంగా) సీట్లు పెరుగుతాయంటున్నారు? ఎవరికి నష్టం జరగదంటున్నారు?

**రేవంత్ రెడ్డి:** నేను పూర్తిగా విశ్లేషించి చెప్పాలనుకుంటున్నా. పంజాబ్ కూడా లాస్ అవుతోంది.. బీమారు రాష్ట్రాలు లబ్ధి పొందుతాయి... ఉత్తరప్రదేశ్ లో 80 సీట్లు ఉంటే 50 శాతం పెంచాలనుకుంటే 120 అవుతాయి. తమిళనాడులో 39 సీట్లున్నాయి. 50 శాతం చొప్పున పెంచితే 60 వస్తాయి. ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాల తేడా 40 సీట్లు ఉంటే ప్రొరేటా ప్రకారం చేస్తే 60 సీట్లు తేడా వస్తాయి. ఒక్క రాష్ట్రంలోనే ఇంత తేడా ఉంటే.. మిగతా రాష్ట్రాల పరిస్థితి ఏమిటి?

దక్షిణాదిలో మొత్తం 126 ఉంటే 50 శాతం ప్రకారం పెరిగితే ఇంకో 60 నుంచి 62 సీట్లు గరిష్టంగా పెరుగుతాయి. 185 సీట్లతో మావి పూర్తవుతాయి...? మీకు మంచి హృదయం ఉంటే ఎందుకు అఖిలపక్షం పెట్టడం లేదు.. ఇది ప్రభుత్వపరమైన నిర్ణయం. ఎందుకు అధికారులకు వదిలేస్తున్నారు. నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకోవాలి.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు అన్ని ఏకం కావాలంటారా?

**రేవంత్ రెడ్డి:** దక్షిణాది రాష్ట్రాలే కాదు ఉత్తరాది రాష్ట్రాలు రావాలి.. పంజాబ్ వంటివి కలిసి రావాలి. పంజాబ్‌లో బీజేపీకి ఏం లేదు. అందుకే వాళ్లకు అక్కడ ఏం తగ్గినా ఇబ్బంది లేదు..వాళ్లకు ఒకట్రెండు దక్కలేదు. వాళ్లు ఒక్క పార్టీ ప్రయోజనాల కోసం చూసుకుంటున్నారు.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** వాళ్లు (బీజేపీ) రాజకీయ ప్రయోజనాలు ఒకలా చూసుకుంటే కాంగ్రెస్ కుల గణన ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటుందనే విమర్శలున్నాయి. కుల గణనను చేపట్టి శాసనసభలో ప్రవేశపెట్టిన తొలి ముఖ్యమంత్రి మీరు. బీజేపీ దక్షిణాది.. ఉత్తరాది తేడాలు తేస్తే మీరు కుల గణనతో తేస్తున్నారు.? మీ నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కుల గణన చేపడుతామంటున్నారు.

**రేవంత్ రెడ్డి:** మీరు ఏ కంపెనీని చూసిన ఏడాదిలో వచ్చిన లాభాలు, నష్టాలు లావాదేవీల చిట్టా ఉంటుంది. అలాంటప్పుడు 75 ఏళ్ల ప్రజాస్వామ్యం తర్వాత ఏ కులం లెక్కలో ఎంతో తెలియకపోతే ఎలా? జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ లెక్కలు చేస్తున్నప్పుడు బీసీ లెక్కలు ఎందుకు చేయకూడదు. మేం అందుకే జన గణనలో కుల గణన చేపట్టాలని శాసనసభలో తీర్మానం పెట్టాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఇది దేశాన్ని కులపరంగా విభజిస్తుంది కదా.?

**రేవంత్ రెడ్డి:** వాళ్ల డిమాండ్ సరైనప్పుడు ఇవ్వడంలో తప్పేం ఉంది. రిజర్వేషన్లు ఎందుకు ఆపాలి. మేం అందుకే రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నాం. బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందనేది మేం చెబుతున్నాం. ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చింది. ఇప్పుడు ఓబీసీలకు ఇవ్వాలనుకుంటున్నాం. ఎలాగైనా మేం రిజర్వేషన్లు ఇస్తాం.. మండల్ కమిషన్ 29 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది.. మేం వాటిని ఇంకా పెంచాలనుకుంటున్నాం..

**రాజ్ దీప్ సర్దేశాయ్:** బీజేపీ హిందూత్వ రాజకీయాలు చేస్తే మీరు కుల రాజకీయాలు చేస్తున్నారు. ఒకరు హిందుత్వ పేరుతో, మరొకరు కులం పేరుతో విభజిస్తున్నారు.?

**రేవంత్ రెడ్డి:** మోదీ ప్రభుత్వంలో ఎంత మంది మైనారిటీలు ఉన్నారో మీరు చెప్పండి. స్వాతంత్ర్య ఉద్యమంలో మైనారిటీలు పాల్గొనలేద? అమరులు కాలేదా? ప్రధానమంత్రి ఎందుకు ఇవ్వలేదో అడగండి. ప్రధానమంత్రి ఏ ఒక్క మతానికి అన్యాయం చేయకూడదు కదా?

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీరు మైనారిటీల గురించి చెబుతున్నారు. రంజాన్ సమయంలో ఉద్యోగులను గంటన్నర ముందు ఇంటికి పంపిస్తూ వారిని బుజ్జగిస్తున్నారని బీజేపీ నేతలు అంటున్నారు.

**రేవంత్ రెడ్డి:** ప్రతి మత విశ్వాసాన్ని మేం గౌరవిస్తున్నాం. మనం దసరా, నవరాత్రి జరుపుకోవడం లేదా? తిరుపతి వెళ్లే వారికి రాయితీలు ఇస్తున్నాం. ఈ దేశంలో ఉన్న ప్రతి మతంలోని వ్యక్తి విశ్వాసాలను మనం గౌరవించాలి.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** హిందువులు, ముస్లింలు...

**రేవంత్ రెడ్డి:** హిందూ, ముస్లిం, క్రైస్తవం ఎవరివైనా? 200 ఏళ్లకుపైగా పాలించిన బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత ఆంగ్లో ఇండియన్లకు పార్లమెంట్, అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇచ్చాం.

**ప్రీతి:** డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది పార్టీలు ఏకమవుతాయంటున్నారు.. త్రి భాషా విధానంపై....

**రేవంత్ రెడ్డి:** వాస్తవానికి దక్షిణాది పార్టీలే కాదు మొత్తం దక్షిణాది ప్రజలు...బీజేపీ మాతో లేదు.. ఏ భాషా నేర్చుకోమని జబర్దస్ చేయాల్సిన అవసరం లేదు. కాలేజీల్లో మనం ఫ్రెంచ్, జర్మన్, సంస్కృతం నేర్చుకుంటాం.. హిందీ అధికార భాష కాదు.. ఎక్కువ మంది మాట్లాడే భాష.. తర్వాత తెలుగు, బెంగాలీ. ఎక్కువ మంది మాట్లాడతారు.

హిందీ కోసం మోదీ, అమిత్ షా ఎందుకు పట్టుపడుతున్నారు. హిందీని పట్టుకొని తెలుగు, బెంగాలీని ఎందుకు వదిలేస్తున్నారు.. హిందీ ఆప్షనల్‌గా ఉంటే మాకు ఇబ్బంది లేదు.. నేను ఇప్పుడు హిందీలోనే మాట్లాడుతున్నా.. కానీ మమ్మల్ని ఎక్కువగా కొట్టాలని చూడొద్దు... మేం దానికి వ్యతిరేకం.. బిజినెస్, ఉద్యోగం కోసం ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాం.. ఇది మన మాతృ భాష కాదు..

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీరు ప్రమాదంలో ఉన్నారు. దేశంలో కేవలం ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఉన్నారు. మీరు హర్యానా, మహారాష్ట్ర ఓడిపోయారు. తెలంగాణను తప్పించి మిగతా చోట్ల ఓడిపోతున్నారు. మీరు ఎందుకు ఎన్నికల్లో ఓడిపోతున్నారు.? వారు ఎందుకు వరుసగా గెలుస్తున్నారు.

**రేవంత్ రెడ్డి:** మాకు అనుబంధ సంస్థలుగా యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ ఉన్నాయి. బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ ఉన్నాయి.. వారు నైస్ ఆర్ ఐస్‌తో పోరాడుతున్నారు.. నైస్ అంటే నార్కొటిక్స్, ఇన్‌కంటాక్స్ బ్యూరో, సీబీఐ, ఐడీ... ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి బీజేపీవారి నుంచి నైస్ కావాలా. ఐస్ కావాలా అని ఫోన్ వస్తుంది. నైస్ వస్తే జైలుకు పోతారు. ఐస్ వస్తే బీజేపీ టిక్కెట్ వస్తుంది.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీరు తెలంగాణలో గెలిచి మిగతా చోట ఎందుకు గెలవడం లేదు?

**రేవంత్ రెడ్డి:** అత్యంత ప్రజాస్వామ్యయుతంగా, ఉదారంగా ఉండడమే మా బలహీనత..50 ఏళ్లు రాజ్యసభ సభ్యులుగా ఉన్నవాళ్లు కూడా తర్వాత టికెట్ ఇవ్వకపోతే మా నేతలు జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తారు. మీరు ఇంటర్వ్యూలు చేస్తారు.. బీజేపీలో అద్వానీ, మనోహర్‌జోషి వంటి పెద్ద నేతలను పక్కనపెట్టిన ఒక్కరూ మాట్లాడరు..

**ప్రీతి:** ప్రమాదంలో ఉన్న ముగ్గురిలో ఒకరని రాజ్‌దీప్ సర్దేశాయ్ చెప్పారు.. మీరు ప్రధానమంత్రితో సన్నిహితంగా ఉన్నందున పార్టీ అగ్రనాయకత్వం గుర్రుగా ఉందంటున్నారు.

**రేవంత్ రెడ్డి:** పార్టీ వేరు.. ప్రభుత్వం వేరు. ప్రభుత్వాలు కలిపి పని చేస్తాయి.. ముఖ్యమంత్రిగా నేను ప్రధానమంత్రిని గౌరవిస్తా. నేను పార్టీ వేదికపై పార్టీ విషయాలు మాట్లాడతా..

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీ రాష్ట్రంలో స్కిల్ యూనిర్సిటీకి గౌతం అదానీ రూ.వంద కోట్లు ఆఫర్ చేస్తే మీరు తిరస్కరించారు. మీ పార్టీ అగ్ర నాయకత్వం, రాహుల్ గాంధీ వ్యతిరేకించారా?

**రేవంత్ రెడ్డి:** పార్టీ వ్యతిరేకించలేదు.. మా ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకించాయి. ప్రజల కోసం రూ.100 కోట్లను తేవాల నుకున్నా. బీజేపీ అదానీ నుంచి తీసుకున్న బాండ్లను ఎందుకు వెనక్కి ఇవ్వలేదు? నేను వెనక్కి ఇచ్చా..నేను ఎటువంటి అపవాదు ఎదుర్కొదల్చుకోలేదు.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** మీరు మహా కుంభ్‌మేళా వెళ్లలేదా?

**రేవంత్ రెడ్డి:** మా కుటుంబం వెళ్లింది. నేను భద్రాచలం రావాలని మోదీ, అమిత్ షాను ఆహ్వానించినా రాలేదు. మా గ్రామంలోనూ రామ మందిరం ఉంది. భద్రాచలం పరమ పవిత్ర క్షేత్రమని నేను నమ్ముతా.. అయినా మోదీ, అమిత్ రావడం లేదు. (నవ్వులు)

**ప్రీతి:** రాహుల్ గాంధీ కుంభ్‌మేళా వెళ్లాలని మీరు అనుకోలేదా?

**రేవంత్ రెడ్డి:** అవకాశం దొరికిందాన్ని బట్టి ఉంటుంది. రాజ్‌దీప్ మీరు వెళ్లారా?

**రాజ్ దీప్ సర్దేశాయ్:** నేను 2008లో వెళ్లా..

**రేవంత్ రెడ్డి:** అంటే, ఇప్పుడు వెళ్లలేదా?

**రాజ్ దీప్ సర్దేశాయ్:** ఈసారి వెళ్లలేదు.

**రేవంత్ రెడ్డి:** ప్రీతి మీరు వెళ్లారా?

**ప్రీతి:** నేను రాజకీయాల్లో లేను. నేను రాజకీయవేత్తను కాను.

**రేవంత్ రెడ్డి:** మీరు, నేను (రాజకీయ నేతలు, జర్నలిస్టులు) ప్రజా జీవితంలోనే ఉన్నాం.

**రాజ్ దీప్ సర్దేశాయ్:** రేపు క్రీడా శాఖ మంత్రి హైదరాబాద్ వస్తున్నారు. వచ్చే ఒలింపిక్స్‌కు అహ్మదాబాద్ కన్నా హైదరాబాద్ మిన్న అని మీరు చెబుతారా?

**రేవంత్ రెడ్డి:** నేను ఇప్పటికే క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు వినతిప్రతం ఇచ్చా.. హైదరాబాద్ ఇప్పటికే మిలటరీ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. నిఖత్ జరీన్, సానియా మీర్జా, పి.వి.సింధు సహా ఒలింపిక్స్, క్రికెట్‌లో రాణించిన వారంతా తెలంగాణ నుంచి వచ్చారు... అహ్మదాబాద్ కన్నా మా దగ్గర వంద రెట్లు ఎక్కువగా వసతులున్నాయి. మీరు నిజ నిర్ధారణ బృందం పంపండి..

అహ్మదాబాద్, హైదరాబాద్‌ల్లో ఏమేం వసతులున్నాయో తేల్చండి.. ఒలింపిక్స్ గేమ్స్ హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని మేం ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రపంచసుందరి పోటీలు మేలో హైదరాబాద్‌లో జరగబోతున్నాయి. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఎందుకు ఒలింపిక్స్ జరగకూడదు?

**రాజ్ దీప్:** అహ్మదాబాద్.. హైదరాబాద్ ఏదో తేల్చుకోవాలని ఒలింపిక్స్ ప్రతినిధులకు రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు?.

**రేవంత్ రెడ్డి:** అహ్మదాబాద్‌కు నరేంద్ర మోదీ బ్రాండ్ అంబాసిడర్... హైదరాబాద్ బ్రాండ్‌ను రేవంత్ రెడ్డి ఎక్కడికి తీసుకెళతారో చూడండి...

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 08, మార్చి 2025 ||





## విజయ్ కాదు ప్రభాస్... ప్లాన్ ఛేంజ్?

సినీ పరిశ్రమలో ఎక్కువగా ప్రయోగాలకు సిద్ధమయ్యే నిర్మాతల్లో ఒకరు దిల్‌రాజు. భారీ చిత్రాలను నిర్మించడంలో ఎప్పుడూ ఈయన ముందుంటారు. దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణతో కలిసి జటాయు అనే ఫాంటసీ అడ్వెంచర్ ప్రాజెక్ట్ ప్లాన్ చేశారు. దీనిని విజయ్ దేవరకొండతో పాన్ ఇండియా లెవెల్‌లో రూపొందించాలని, భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాలని నిర్ణయించారు. స్టోరీ పరంగానే కాకుండా ఈ సినిమా గ్రాండ్ విజువల్స్, కొత్త కాన్సెప్ట్‌తో యూనిక్ సినిమాగా ఉండబోతుందనే టాక్ వినిపించింది. కానీ కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకెళ్లలేదు. స్క్రిప్ట్ లెవెల్ నుంచే జటాయు పట్ల దిల్ రాజుకు పూర్తిగా సంతృప్తికి రాలేదని సమాచారం. మోహనకృష్ణ ఇంద్రగంటి కథా కథనాలను ఎంతో జాగ్రత్తగా డెవలప్ చేస్తున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిలబెట్టే విధంగా స్క్రీన్‌ప్లే లేదనే అభిప్రాయంతో దిల్ రాజు వెనక్కి తగ్గారని టాక్.

స్క్రిప్ట్‌లో మరిన్ని మార్పులు చేయాలనుకుంటున్నా, కాంబినేషన్ ను నమ్మి అంత భారీ బడ్జెట్ పెట్టి రిస్క్ తీసుకోవడం సరైనదేనా అనే అనుమానాలు నిర్మాతలో మొదలయ్యాయి. అదే సమయంలో విజయ్ దేవరకొండ నటించిన లైగర్ భారీ స్థాయిలో ఫ్లాప్ అవ్వడం కూడా దిల్ రాజు నిర్ణయంపై ప్రభావం చూపింది. పాన్ ఇండియా రేంజ్‌లో వచ్చిన ఆ సినిమా పూర్తిగా విఫలమై, డిస్ట్రిబ్యూటర్లకు పెద్ద నష్టాన్ని మిగిల్చింది. దీంతో విజయ్ మీద అంత భారీ బడ్జెట్ పెట్టడం, ముఖ్యంగా ఒక ఫాంటసీ అడ్వెంచర్ తరహా సినిమాకు ఆయనని సెలెక్ట్ చేయడం సరైన నిర్ణయమా అనే డౌట్స్ నిర్మాతలో ఎక్కువయ్యాయి. దీంతో హీరోను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. కేవలం హీరో మాత్రమే కాదు, డైరెక్టర్ ఎంపిక విషయంలోనూ దిల్ రాజు కొత్త ఆలోచనలో పడ్డారు.

మోహనకృష్ణ ఇంద్రగంటి ఇప్పటి వరకు పెద్ద బడ్జెట్ సినిమాలు డీల్ చేయలేదు. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'వి' కూడా మిక్స్‌డ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఓటీటీలో విడుదలైనా ఆ ప్రాజెక్ట్ మీద పెద్దగా హైప్ రాలేదు. దీంతో మోహనకృష్ణ దర్శకత్వంలో భారీ సినిమా ప్లాన్ చేయడం సేఫ్ కాదనే సలహాలు కూడా వచ్చాయట. ప్రస్తుతం దిల్ రాజు ఈ జటాయు ప్రాజెక్ట్‌ను పూర్తిగా కొత్త దారిలో తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కొత్త దర్శకుడు, కొత్త రైటర్స్‌తో కథను మరింత కమర్షియల్‌గా, భారీగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారని టాక్. దిల్ రాజు చాలా కాలంగా ప్రభాస్ తో సినిమా చేయాలని చూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు జటాయు కథతో ప్రభాస్‌ను అప్రోచ్ చేసే యోచనలో ఉన్నాడని టాక్.



## జాలీగా కొత్తజంట

అక్కినేని నాగ చైతన్య, శోభితల వివాహం గత ఏడాది డిసెంబర్ 4న వైభవంగా జరిగింది. అన్నపూర్ణ స్టూడియోలోని ఏఎన్నార్ విగ్రహం ముందు ఇరు కుటుంబాల సమక్షంలో ఈ వివాహం జరిగింది. చైతూ, శోభితల వివాహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలో సోషల్ మీడియాలో దాదాపు రెండు వారాల పాటు వైరల్ అయ్యాయి. పెళ్లికి ముందు జరిగిన కార్యక్రమాలు, పెళ్లి తర్వాత జరిగిన కార్యక్రమాలు ఇలా ప్రతి సందర్భంలోనూ వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. తాజాగా మరోసారి వీరిద్దరి ఫోటో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ తెగ వైరల్ అవుతోంది. అక్కినేని ఫ్యాన్స్ ఈ ఫోటోను తెగ షేర్ చేస్తున్నారు. నాగ చైతన్య, శోభిత చివరిసారిగా తండేల్ సినిమా ఈవెంట్ సందర్భంగా కనిపించారు. ఆ సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు సైతం వైరల్ అయ్యాయి. తాజాగా మరోసారి వీరిద్దరు ఒకే ఫ్రేమ్ లో కనిపించారు.

ఇటీవలే తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని సొంతం చేసుకున్న నాగ చైతన్య విజయానందం లో ఉన్నారు. త్వరలోనే చైతూ కొత్త సినిమా షూటింగ్‌కి జాయిన్ కాబోతున్నారు. అంతకు ముందు భార్య శోభితతో కలిసి విదేశాలకు హాలీడే ట్రిప్‌కి వెళ్లినట్లు తెలుస్తుంది. అక్కడ సింపుల్‌గా నాగ చైతన్య, శోభిత ఇలా కూర్చుని తింటున్న ఫోటోలను క్లిక్ అనిపించారు. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. స్టైలిష్ లుక్‌లో నాగ చైతన్య కనిపించగా, శోభిత సింప్లీ సూపర్ అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇద్దరి జోడీ చూడ చక్కగా ఉందని, వీరిద్దరూ కలకాలం సంతోషంగా జీవితాన్ని సాగించాలని కోరుకుంటూ పలువురు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ పోస్ట్‌లు చేస్తున్నారు.

## యు.వి. క్రియేషన్స్‌లో శర్వా

చార్మింగ్ స్టార్ శర్వా తన 36వ మూవీ చ%హ్త్రుతీఘు%36 లో స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్ గా కనిపించబోతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వం లో ప్రతిష్టాత్మక యు.వి. క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫైనల్ స్టేజ్ కి చేరుకుంది. త్వరలోనే టైటిల్ ను లాంచ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. శర్వాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ సినిమాలో అతని లుక్ ను రివిల్ చేస్తూ ఒక పోస్టర్ ను విడుదల చేశారు. టోర్న్ జీన్స్, స్టైలిష్ స్పోర్ట్స్ జాకెట్, షేడ్స్ ధరించి యమహా ఆర్.ఎక్స్-100 బైక్ పై కూర్చున్న శర్వా లుక్ అదిరిపోయింది. శర్వా కూల్ అండ్ ఎనర్జిటిక్ వైబ్ తో కనిపించిన ఈ లుక్ ఛరిస్మాటిక్ గా వుంది. వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకునే శర్వా, ఈ చిత్రంలో మరో సవాలుతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఈసారి, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆడ్రినలిన్ రష్‌ని ఇచ్చే స్టంట్స్ తో అదరగొట్టబోతున్నారు. ఈ చిత్రంలో మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ హై-ఎనర్జీ చిత్రం మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్ డ్రాప్ లో ఉండబోతోంది, మూడు తరాల నేపధ్యంలో ఒక కుటుంబం, ప్రేమ, కలలతో ముడిపడి 90%ం, 2000ం% ప్రారంభంలోని ఎక్సయిటింగ్ మోటోక్రాస్ బ్యాక్ డ్రాప్ లో ఉన్న అద్భుతమైన కథ.







## "దిల్ రూబా"తో సెలబ్రేట్ చేసుకుందాం : హీరో కిరణ్ అబ్బవరం

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా "దిల్ రూబా". ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. "దిల్ రూబా" చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. "దిల్ రూబా" సినిమా ఈనెల 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ – "దిల్ రూబా" ట్రైలర్ కు మీరు ఇచ్చే రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఒక ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా నాకున్న అనుభవంతో చెబుతున్నా "దిల్ రూబా" కిరణ్ అబ్బవరం కెరీర్ లో ఎప్పటికీ గుర్తుండిపోయే మూవీ అవుతుంది. 2019లో కిరణ్ నాకు ఈ కథ పంపించాడు. కథ బాగా నచ్చింది. అయితే ఇప్పటి ప్రేక్షకులకు సినిమాను గ్రాండియర్ గా చూపిస్తేనే ఆదరిస్తున్నారు. ఈ క్రమంలోనే సారెగమా వారితో అసోసియేట్ అయ్యాం. "దిల్ రూబా" సినిమా కంటెంట్ మీరు చూస్తున్నారు ఎంత రిచ్ గా ఉందో. హీరోయిన్స్ ఇద్దరూ మిమ్మల్ని కంటతడి పెట్టిస్తారు. వాళ్ల పర్ ఫార్మెన్స్ అంత బాగుంటుంది. దర్శకుడు విశ్వకరుణ్ కథ నెరేషన్ తో ఆకట్టుకుంటాడు. మాకు ఒక మంచి మూవీ చేశాడు. డీవోపీ డేనియల్, ప్రొడక్షన్ డిజైనర్ సుధీర్..మ్యూజిక్ చేసిన సామ్ సీఎస్ గారు.ఇలా టీమ్ అంతా చాలా కష్టపడ్డారు. నా ఫ్రెండ్స్ కొందరు ఈ ప్రాజెక్ట్ కోసం సపోర్ట్ చేశారు. వారందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. ఈ నెల 14న హోలీ రోజున మా "దిల్ రూబా" సినిమా థియేటర్స్‌లో చూడండి. మీకు తప్పకుండా నచ్చుతుందని చెప్పగలను. అన్నారు.

## 'బందీ' సినిమాను ఆదరించిన ప్రేక్షకులకి థాంక్స్

విలక్షణ నటుడు ఆదిత్య ఓం బందీ అనే చిత్రంతో గత వారం ఆడియెన్స్‌ను పలకరించిన సంగతి తెలిసిందే.రఘు తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గల్లీ సినిమా బ్యానర్‌పై నిర్మించారు.



ఈ మూవీకి థియేటర్లో ఆడియెన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. బందీ మంచి విజయాన్ని సాధించడంతో చిత్రయూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో..తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ..లి 'బందీ సినిమా అద్భుతంగా ఉంది. పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. అందుకే ఈ సినిమాకు ఇంకా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి. ఆదిత్య ఓం ఎంతో విలక్షణ నటుడు. యూపీ నుంచి ఇక్కడకు వచ్చి తన ప్యాషన్‌తో పని చేస్తున్నారు. బందీ విజువల్స్, కెమెరా వర్క్ అద్భుతంగా ఉంది. రఘు తిరుమల మంచి పాయింట్‌తో సినిమాను చేశారు. అందరినీ ఆకట్టుకున్న ఈ చిత్రం మరింత ముందుకు వెళ్లాలి. కమర్షియల్‌గా బందీ సినిమా ఆడటం ఆనందంగా ఉంది' అని అన్నారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144